ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వెల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 27 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 50
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## అలకనంద నదిలో పడిన బస్సు.. ఇద్దరు మృతి, 10 మంది యాత్రికులు మిస్సింగ్

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లో యాత్రికులతో వెళ్తున్న ఓ బస్సు అలనకంద నదిలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఇంకా పది మంది యాత్రికుల ఆచూకీ తెలియడంలేదు. టెంపో ట్రావెలర్ వాహనంలో వెళ్తున్న భక్తుల బస్సు నదిలో పడినట్లు పోలీసులు వెల్లడించారు. రుద్రప్రయాగ్ నుంచి గౌచార్ మార్గమధ్యంలో ఉన్న బ్రదీనాథ్ జాతీయ రహదారిపై గోల్‌తిర్ గ్రామం వద్ద ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన ప్రదేశానికి రిలీఫ్, రెస్క్యూ బృందాలు చేరుకున్నాయి. నది నుంచి రెండు మృతదేహాలను వెలికితీశారు.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

## రాజ్యాంగమే సుప్రీం



- మూడు ప్రజాస్వామ్య విభాగాలు రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి
- రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం మాత్రం లేదు
- పార్లమెంట్ అత్యున్నతమని కొందరు చెబుతుంటారు
- కానీ, తన ఉద్దేశంలో రాజ్యాంగమే సుప్రీం
- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్




## టూ వీలర్లపై టోల్ చార్జీలుండవ్

- జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) స్పష్టం
- టూ వీలర్లకు కూడా టోల్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు జాతీయ మీడియాలో వస్తున్న కథనాలన్నీ అవాస్తవం
- ఇటువంటి కట్టుకథలు, తప్పుడు వార్తలను ఎవరూ నమ్మొద్దు



# చరిత్ర సృష్టించిన శుభాన్షు

- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మన తొలి ముద్ర
- తొలి భారతీయునిగా వాయుసేన పైలట్ రికార్డ్
- గగన్‌యాన్ దిశగా కీలక ముందడుగు
- భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాధ్యాయం
- 28 గంటల అనంతరం ఐఎస్ఎస్‌తో యాగ్జియం-4 అనుసంధానం


## ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా సరే
# చట్ట రీత్యా నేరమే

- డ్రగ్స్ పట్టుబడితే విద్యాసంస్థలపైనా కేసులు
- స్కూళ్లు, కళాశాలల దగ్గర గంజాయి చాక్లెట్ల సంస్కృతేంటి?
- చదువులు చెప్పడంతోనే యాజమాన్యాల బాధ్యత తీరిపోదు
- పిల్లల్లో వ్యసనాలను కనిపెట్టాలి
- ఎవరైనా మాదకద్రవ్యాలతో రాష్ట్రంలోకి రావాలంటే భయపడాలి
- అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి




సూర్య హైదరాబాద్

రాబోయే రోజుల్లో కళాశాలలు, పాఠశాలల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలు పట్టుబడితే యాజమాన్యాల మీద కేసులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఫీజులు వసూలు చేయడం తప్ప.. పిల్లల బాధ్యత తమది కాదని విద్యాసంస్థలు భావిస్తే కుదరదని స్పష్టం చేశారు. స్కూళ్లు, కళాశాలల దగ్గర కిరాణా దుకాణాల్లో గంజాయి చాక్లెట్లు విక్రయించే సంస్కృతి కనిపిస్తోందని, అలాంటి వాతావరణం ఉంటే విద్యార్థులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదాపూర్ శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో - మిగతా2లో



## మేడిన్ ఇండియా
# ఎలక్ట్రానిక్స్

- 2023-%24లో రూ. 9.5 లక్షల కోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి
- తొమ్మిదేళ్లలో అయిదు రెట్లు దూసుకెళ్లిన పరిశ్రమ
- మనం వినియోగిస్తున్న ఫోన్లలో 99% భారత్‌లో తయారీ
- విడిభాగాల తయారీకి రూ.22,919 కోట్ల పీఎల్ఐ పథకం

# రూ. 1,393 కోట్లను తక్షణమే చెల్లించండి

**'కాళేశ్వరం' రుణ బకాయిలపై సర్కారుకు ఆర్ఈసీ లేఖ**



- లేకుంటే రుణాలు నిరర్థక ఆస్తులుగా మారతాయని వెల్లడి
- గడువుకు 75%-%85 రోజుల తర్వాత చెల్లింపులతో జరిమానా, వడ్డీల భారం తప్పదని స్పష్టీకరణ
- రాష్ట్ర రుణపరపతి, క్రెడిట్ రేటింగ్‌పైనా ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరిక
- రుణాల పునర్వ్యవస్థీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి తిరస్కృతి



## జగదాంబిక అమ్మవారికి
# తొలి బోనం

**భాగ్యనగరిలో ప్రారంభమైన ఉత్సవాలు**

సూర్య హైదరాబాద్

రాజధానిలో బోనాల సందడి మొదలైంది. గురువారం గోల్కొండ కోటలోని శ్రీజగదాంబిక అమ్మవారికి బంగారు బోనం సమర్పించడంతో నెల రోజుల పండగ ప్రారంభమైంది. మహిళలు బోనాలతో వచ్చి.. మొక్కులు చెల్లించుకోగా శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, - మిగతా2లో

# జూరాల భద్రమేనా?

- 4వ గేటులో తెగిన ఇనుప రోప్
- తాజాగా తెగిన ప్రాజెక్టు 4వ గేటు ఇనుప రోప్
- ఇదివరకే తెగిన మరో 8 గేట్ల ఇనుప రోప్‌లు
- దెబ్బతిన్న 18 గేట్ల రబ్బర్ సీళ్లు.. ఏడాదిగా లీకేజీలు
- ప్రమాదం లేదంటున్న ఇరిగేషన్ అధికారులు



సూర్య హైదరాబాద్

కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి రాష్ట్రంలోనే మొట్టమొదటిదైన ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పాలమూరు జిల్లా వరప్రదాయినిగా నిలుస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏడు లక్షలకు పైగా ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ఈ ప్రాజెక్టుకు ఏళ్ల తరబడి మర మ్మతులు కరువయ్యాయి. సుమారు ఏడాది కాలంగా గేట్ల నుంచి నీళ్లు లీకవుతుండగా, తాజాగా నాలుగో గేట్ ఇనుప రోప్ తెగిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. జూరాల ప్రాజెక్టుకు పై నుంచి వచ్చిన నీటిని గానీ, సాగు - మిగతా2లో

# లక్షకు పైగా ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్

- వేగంగా పూర్తిచేయడంపై ప్రభుత్వం దృష్టి
- నెమ్మదిగా సాగుతున్న జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ

సూర్య హైదరాబాద్

రాష్ట్రంలో పనులు ప్రారంభమైన (గ్రౌండింగ్ అయిన) ఇందిరమ్మ ఇళ్ల సంఖ్య లక్ష దాటింది. ప్రతిష్మాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో 3,71,086 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 2,78,134 ఇళ్లకు అనుమతులు ఇచ్చింది. - మిగతా2లో



# ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా సరే చట్ట రీత్యా నేరమే

-మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. సినీ నటులు రామ్‌చరణ్, విజయ్ దేవరకొండతో కలిసి శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను వీక్షించిన అనంతరం సీం మాట్లాడుతూ.. "తల్లిదండ్రులు ఉద్యోగాల్లో తలమునకలై విద్యాసంస్థలపై నమ్మకంతో రూ.లక్షలు చెల్లించి పిల్లల్ని చేర్పిస్తున్నారు. పిల్లలు ఎక్కువ సమయం విద్యాసంస్థల్లోనే గడుపుతున్నారు. అందుకే చదువు చెప్పడంతోనే యాజమాన్యం బాధ్యత అయిపోదు. పిల్లల్లో వచ్చే మార్పులు, వారు ఎలాంటి వ్యసనాలకు లోనవుతున్నారో పర్యవేక్షించాల్సిన సామాజిక బాధ్యత విద్యాసంస్థలపై ఉంది. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పుల్ని గమనించడానికి మానసిక నిపుణుల్ని నియమించుకోవాలి.

**గంజాయి హబ్‌గా మారితే మనం విఫలమైనట్టే..**

ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన తెలంగాణ.. డ్రగ్స్ మహమ్మారికి బలి కాకూడదు. రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల వరకూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు బానిసలవుతుంటే చూస్తూ ఊరుకుందామా? దీన్ని నిర్మూలించడానికి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే.. మాదకద్రవ్యాల మాఫియా వెన్ను విరుస్తామని స్పష్టంగా చెప్పాను. మాదకద్రవ్యాలతో ఎవరైనా ఈ రాష్ట్ర సరిహద్దుల్లో కాలుపెట్టాలంటే భయపడేలా పనిచేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చా. అవసరమైతే సరిహద్దులు దాటి వారి వెన్ను విరచాలని స్పష్టంగా చెప్పా. డ్రగ్స్ నియంత్రణ బాధ్యత కేవలం ప్రభుత్వానిది మాత్రమే కాదు. ఈ దేశాన్ని ఎదుర్కోలేమని భావించే శత్రువులు గంజాయి, డ్రగ్స్‌తో యువతను నిర్వీర్యం చేసే ప్రమాదముంది. ఒకప్పుడు భారత స్వాతంత్ర్యోద్యమం, ఆ తర్వాత యుద్ధంలో దేశ రక్షణకు ఉక్కు కవచంగా నిలిచిన పంజాబ్ యువత ఇప్పుడు డ్రగ్స్ మహమ్మారితో పూర్తిగా నిర్వీర్యమైంది. అక్కడి కుటుంబాలు అంతులేని దుఃఖంలో మునిగిపోతున్నాయి. తెలంగాణకు అలాంటి పరిస్థితి రానివ్వకుండా అందరం అప్రమత్తమవ్వాలి. తెలంగాణ అంటే ఒక ఐటీ, ఫార్మా హబ్.. ఈ రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారితే మనమంతా విఫలమైనట్లే. అందుకే మనమంతా అప్రమత్తమై పోలీసింగ్ చేసినప్పుడే వాటిని నియంత్రించగలం. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాలకు సంబంధించి సమాచారముంటే విద్యార్థులే పోలీసులకు ఉప్పందించండి. నో డ్రగ్స్‌కు మీరే వారధులుగా మారి 1908 టోల్‌ఫ్రీ నంబరుకు చెప్పండి" అని ముఖ్యమంత్రి సూచించారు.

**చిరంజీవి వ్యసనాలకు లోను కాలేదు**

సినీ నటుడు రామ్‌చరణ్ నా కళ్ల ముందే పాఠశాలకు వెళ్లారు. ఇప్పుడు నిజమైన స్టార్‌గా చిత్రపరిశ్రమలో రాణిస్తున్నారు. ఆయన నటించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం ఆస్కార్ అవార్డు పొందింది. ఆయన తండ్రి చిరంజీవి ఎంతో కష్టపడి దేశం గర్వించదగ్గ మహానటుడిగా గుర్తింపు పొందారు. 50 ఏళ్ల నిరంతర శ్రమతో ఎదిగారు. ఎన్ని కష్టాలు, అవమానాలు ఎదురైనా ఆయన కుంగిపోలేదు. భయపడి మాదకద్రవ్యాలు, వ్యసనాలకు బానిస కాలేదు. ధైర్యంగా నిలబడి రాణించారు. నటులు సినిమాల్లో పోషించే పాత్రలను కాదు.. వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి. నేను




నల్లమల అడవుల నుంచి జడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు.. ఇలా ఒక్కో అడుగు వేసుకుంటూ 16 ఏళ్లలో ముఖ్యమంత్రి స్థాయికి వచ్చా. మా పాలమూరు జిల్లా నుంచి వచ్చిన నటుడు విజయ్ దేవరకొండ ఎంతో మంది ప్రజల అభిమానం పొందారు. కష్టం, నిబద్ధత లేకుండా ఈ స్థాయికి రాలేరు. అందుకే తెలంగాణ యువత ప్రపంచంతో పోటీపడాలనే ఉద్దేశంతో ఏ రాష్ట్రానికి లేని తరహాలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాలు క్రీడల శిక్షణ కోసం హైదరాబాద్‌కు రావాలనే రీతిలో క్రీడా విధానం తెచ్చాం. ప్రపంచంతో పోటీపడాలనే ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకురావాలని నిర్ణయించాం. క్రీడల్లో రాణించడమే కాదు.. పదేళ్లలో ట్రిలియన్ డాలర్లు, 22 ఏళ్లలో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించాం.

**అందుకే 'ఈగల్' పేరు**

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఇకపై 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)గా పిలవాలని నిర్ణయించుకున్నాం. గద్ద ఆకాశంలో 20– 30 వేల అడుగుల ఎత్తులో ఎగిరినా.. నేల మీదున్న లక్ష్యాన్ని నిశితంగా గమనిస్తుంది. దాని సక్సెస్ రేటు 100 శాతం. అందుకే 'ఈగల్' అని పేరు పెట్టాం. ఈ మధ్యకాలంలో గద్దలకు యాంటీ డ్రోన్ శిక్షణ ఇస్తున్నాం. ఎక్కడైనా వీవీఐపీలు ఉన్న ప్రాంతంలో డ్రోన్‌లు ఎగరేస్తే అవి గుర్తిస్తాయి. అదే తరహాలో.. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి పండించినా 'ఈగల్' విభాగం తన నిఘాతో కనిపెడుతుంది. తెలంగాణలోని 1.5 కోట్ల ఎకరాల సాగుభూముల్లో ఎక్కడ గంజాయి మొక్క పెరిగినా గుర్తిస్తుంది. సరిహద్దుల్లోకి డ్రగ్స్ రవాణాను నిశితంగా గమనిస్తుంది" అని సీఎం పేర్కొన్నారు.

**డ్రగ్స్ తీసుకుంటే పరిశ్రమ నుంచి నిషేధం: టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు**

తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన వారెవరైనా డ్రగ్స్ తీసుకుంటే వారిపై నిషేధం విధించేలా చర్యలు తీసుకుంటామని టీఎఫ్‌డీసీ ఛైర్మన్, సినీ నిర్మాత దిల్‌రాజు పేర్కొన్నారు. "చిత్ర పరిశ్రమకు చెందినవారు డ్రగ్స్ తీసుకుంటే బహిష్కరించాలని మలయాళ సినీ ఇండస్ట్రీ ఒక నిర్ణయం తీసుకుంది. ఇక్కడ కూడా డ్రగ్స్ తీసుకున్న వారిని తెలుగు చిత్రం పరిశ్రమ నుంచి నిషేధించినప్పుడు ప్రజల్లోకి ఒక సందేశం వెళ్తుంది. తెలుగు సినిమాల్లో కూడా ఇది పాటించేలా చేస్తాం. డ్రగ్స్ నిర్మూలన మన కర్తవ్యం. అప్పుడే మన రాష్ట్రం డ్రగ్స్ రహితంగా మారుతుంది" అని పేర్కొన్నారు.

**మన భవిష్యత్తును మనమే రక్షించుకుందాం: రామ్‌చరణ్**

నా చిన్నప్పుడు పాఠశాలల బయట గోలీ సోడాలు, తినుబండారాలు విక్రయించే బండ్లు ఉండేవి. ప్రస్తుతం అలాంటి బండ్లు మాదకద్రవ్యాలు అమ్మే ప్రాంతాలుగా మారుతున్నాయి. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ సైనికుడిలా మారాలి. "కొన్నేళ్ల క్రితం పాఠశాలల సమీపంలో పిల్లలకు ఐస్‌క్రీమ్‌లో మత్తు పదార్థాలు కలిపి ఇస్తున్నట్లు తెలిసి తల్లిదండ్రులు పెద్ద ధర్నాకు దిగారు. ఈ స్థితిలో పిల్లల్ని బయటకు పంపించాలంటేనే భయమేస్తోంది. మన భవిష్యత్తును, కుటుంబాన్ని, స్నేహితులను, పాఠశాలను రక్షించుకుందాం.

**అమెరికా పరిస్థితి ఏంటో చూస్తున్నాం: విజయ్ దేవరకొండ**

డ్రగ్స్ దేశ యువతని నిర్వీర్యం చేస్తాయి. ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా పరిస్థితి ఏంటో చూస్తున్నాం. ఒక్కసారి డ్రగ్స్ తీసుకుని చూద్దామనే ఆలోచనే రానివ్వకూడదు. జీవిత లక్ష్యం కోసం శ్రమించాలి. స్నేహితులు, సహచరుల ప్రవర్తన, చర్యలతో మనం ప్రభావితమవుతాం. దేశం అభివృద్ధి చెందాలంటే యువతే కీలకం. మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి.

**'నశా ముక్త్ తెలంగాణ' లక్ష్యం**
**- సందీప్ శాండిల్య, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్**

రాష్ట్రాన్ని 'నశా ముక్త్ తెలంగాణ'గా మార్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఇందుకోసం దేశంలోనే అత్యుత్తమ నార్కోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. గతంలో డ్రగ్స్ వినియోగదారులు పట్టుబడితే స్టేషన్ బెయిలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కర్నీ కోర్టు ముందు హాజరుపరుస్తున్నాం. విద్యార్థుల సహకారంతో ఈ భూతాన్ని తుదముట్టించాలి.

**డ్రగ్స్ వద్దు.. క్రీడలే ముద్దు**
**- పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ కోచ్**

మారుతున్న పరిస్థితులతో ఫిజికల్ లిటరసీ తగ్గుతోంది. సిగరెట్, డ్రగ్స్ తీసుకునే పెద్దలు, ప్రముఖుల్ని చూసి పిల్లలు చెడు అలవాట్లు చేసుకోవద్దు. ఈ ఒక్కసారికే అనే ఆలోచనతో మాదకద్రవ్యాలు తీసుకోవద్దు. డ్రగ్స్ వద్దు (సే నో టు డ్రగ్స్) తరహాలో క్రీడలకు సరే (సే ఎస్ టు స్పోర్ట్స్) అని అంతా చెప్పాలి.

ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, ఉన్నతాధికారులు చారుసిన్హా, అనితా రామచంద్రన్, రవిగుప్తా, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# జూరాల భద్రమేనా?

-మొదటిపేజీ తరువాయి

అవసరాలకు గానీ ఆపరేట్ (పైకెత్తడం) చేయడం ద్వారా దిగువకు నీరు విడుదల చేసేలా సులభతరమైన విధానంలో మొత్తం 62 గేట్లను అర్ధ చంద్రాకారంల్లో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటిని పైకి, కిందికి ఆపరేట్ చేసేందుకు గేట్లకు ఇరువైపులా రెండు రబ్బర్ సీళ్లు (రాపిడికి గురికాకుండా రక్షణ ఇచ్చేది), అడుగుభాగాన ఒక రబ్బర్ సీల్‌తో పాటు గేటుకు ఇరువైపులా రెండు, కింది భాగాన రెండు ఇనుప రోపులు అమర్చారు.

వీటి సాయంతోనే రేడియల్ క్రస్ట్ గేట్లను అవసరమైనప్పుడు పైకెత్తడం, దించడం జరుగుతుంది. అవసరమైనప్పుడు నీటిని విడుదల చేయడం.. లేనిపక్షంలో నిలిపివేయడంలో ఇవి కీలకం. అలాంటి ఎనిమిది గేట్ల ఇనుప రోప్‌లు, 18 గేట్ల రబ్బర్ సీళ్లు దెబ్బతినడంతో లీకేజీలు ఏర్పడ్డాయి.

**40 ఏళ్ల తర్వాత తొలిసారిగా..**

జూరాల ప్రాజెక్టు చరిత్రలో 40 ఏళ్ల తర్వాత తొలిసారిగా అన్ని గేట్లకు సంబంధించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు సుమారు నాలుగేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రబ్బర్ సీళ్లు, రోప్‌లు, శాండ్ బ్లాస్టింగ్, గేట్ల బలోపేత, బకెట్ నిర్మాణాల మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేపట్టాలి. హైదరాబాద్‌కు చెందిన స్వప్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకుంది.

ఏడాది కాలపరిమితిలో పూర్తిచేసేలా ఒప్పందం కుదిరింది. ఏడాది గడువు ముగిసింది. మరోసారి పొడిగించారు. అయినా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సగం శాతం పనులు కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది. ప్రాజెక్టు పైభాగాన ఉన్న హయిస్ట్ బ్రిడ్జ్ గేట్ల వద్ద వాక్‌వే బ్రిడ్జికి సంబంధించి శాండ్ బ్లాస్టింగ్ పనులు పూర్తికాగా.. మిగిలిన పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

**తాజాగా వరద వదలడంతో..**

తాజాగా గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో 98 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. ప్రాజెక్టు 12 గేట్లను ఎత్తి దిగువకు వదిలారు. అయితే గురువారం ప్రాజెక్టు నాలుగో గేట్ ఇనుప రోప్



తెగిపోయి కన్పించింది. దీంతో ఆ గేట్ ఎత్తలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రాజెక్టు మరమ్మతుల్లో జాప్యం, భద్రత తదితర అంశాలు ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. 2009 మాదిరి జూరాలకు భారీ వరద వస్తే దెబ్బతిన్న గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**అధికారులది పాత పాటే..**

జూరాల ప్రాజెక్టు మరమ్మతుల్లో జాప్యం, భద్రతపై నెలకొన్న అనుమానాల నేపథ్యంలో 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా నాలుగో గేట్ రోప్ తెగిన నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులతో పాటు గద్వాల జిల్లా ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా.. గతంలో చెప్పిన సమాధానాలే చెప్పారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టు మెకానికల్ పనులు చేసే ప్రైవేట్ ఏజెన్సీలు తక్కువగా ఉన్నాయి.

ఈ కారణంగా నాలుగేళ్ల కిందట జూరాల మరమ్మతులకు నిధులు మంజూరు అయినప్పటికీ .. కాంట్రాక్టు ఏజెన్సీ పనులు పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం ఏర్పడింది. ప్రాజెక్టుకు పది లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రమాదమేం లేదు..' అని చెప్పారు. అయితే మరమ్మతులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ముందస్తు వరదతో పనులకు ఆటంకం**

జూరాల ప్రాజెక్టు గేట్లు, రోప్‌లకు సంబంధించి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈసారి అన్ని రకాల సమస్యలను అధిగమించి మెకానికల్ పనులను వేగవంతంగా చేపట్టాలనుకున్నాం. అయితే ముందస్తుగా వరద రావడం ఆటంకంగా మారింది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టుకు వచ్చిన ముప్పు ఏమీ లేదు. రేడియల్ క్రస్ట్ గేట్లు కావడంతో ఎంత పెద్ద వరద వచ్చినా కొట్టుకుపోయే అవకాశం లేదు.

**ఇదీ ప్రాజెక్టు స్వరూపం..**

జూరాల ప్రాజెక్టును 1981లో రూ.550 కోట్లతో నిర్మించారు. దీని పొడవు కిలోమీటర్, ఎత్తు 27.80 మీటర్లు. మొత్తం రాతికట్టడమే. ప్రాజెక్ట్‌కు ఆనుకుని ఎడమ వైపున 1.74 కి.మీలు, కుడివైపున 1.84 కి.మీల మేర ఎర్త్‌డ్యాం నిర్మించారు. మొత్తం 62 రేడియల్ క్రస్ట్ గేట్లు, 84 బ్లాకులతో నిర్మాణం చేశారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. దీని కింద 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది..

## లక్షకు పైగా ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్

-మొదటిపేజీ తరువాయి

వీటిలో ఇంతవరకు 1,00,264 ఇళ్లకు సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. గ్రౌండింగ్ అయినవాటిలో 13,362 పునాదుల వరకు, 2,890 గోడల వరకు, 886 శ్లాబ్ వరకు పూర్తయ్యాయి. మిగతావాటి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు రంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో ఇల్లు చొప్పున రాష్ట్రంలో మొత్తం 4 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వచ్చే పక్షం రోజుల్లో మంజూరుచేసిన అన్ని ఇళ్లు గ్రౌండింగ్ అయ్యేలా హౌసింగ్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. మొత్తం అనుమతులిచ్చిన ఇళ్లలో ఎంపీడీవో లాగిన్లకు 3,21,094 వచ్చాయి. ఇందులో 2,78,134 ఇళ్లకు జిల్లా కలెక్టర్లు అనుమతులు ఇచ్చారు.

**కొన్ని జిల్లాల్లో నెమ్మదిగా..**

లబ్ధిదారుల గుర్తింపు, గ్రౌండింగ్ ప్రక్రియ కొన్ని జిల్లాల్లో నెమ్మదిగా సాగుతోంది. ఇలాంటి జిల్లాలపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించాలని హౌసింగ్‌శాఖ నిర్ణయించింది. రెండు రోజుల క్రితం ఇలాంటి జిల్లాల విషయమై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతాధికారుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా కలెక్టర్లు, హౌసింగ్ పీడీలతో ప్రత్యేక సమావేశాలు పెట్టి ఆ జిల్లాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియలో.. సూర్యాపేట (9.43%), వికారాబాద్ (10.29%), మేడ్చల్ మల్కాజిగిరి (11.84%), జోగులాంబ గద్వాల (12.19%), సిద్దిపేట (13.75%), కుమురంభీం ఆసిఫాబాద్ (15.56%) జిల్లాలు చివరి స్థానాల్లో ఉన్నాయి. దాదాపు సగం జిల్లాల్లో గ్రౌండింగ్ ప్రక్రియ అనుకున్నంత వేగంగా సాగడం లేదు. పలు జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపికకు చాలా సమయం పడుతోంది. అలాగే అనుమతులకు ఆలస్యం జరుగుతోంది. అనుమతులు వచ్చినా ప్రొసీడింగ్ ఉత్తర్వులను లబ్ధిదారులకు అందించడానికి సమయం తీసుకుంటున్నారు.

## జగదాంబిక అమ్మవారికి తొలి బోనం



-మొదటిపేజీ తరువాయి

పోతురాజుల విన్యాసాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. లంగర్‌హౌస్ చౌరస్తాలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు అమ్మవారి తొట్టెల, ఫలహారం బండికి పూజలు నిర్వహించారు. అక్కడే గోల్కొండ ఖిలా జగదాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, కల్లు సాక పెట్టి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పీకర్, మంత్రులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సమృద్ధిగా వర్షాలు పడి, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు మంత్రులు తెలిపారు. పొన్నం ప్రభాకర్ భక్తులతోపాటు నృత్యం చేస్తూ ఉత్సాహపరిచారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ బడాబజార్‌లోని పూజారి ఇంటికి ఊరేగింపు సాగింది. పూజారి ఇంటి నుంచి అమ్మవారిని గోల్కొండ వరకు భక్తులు తోడ్కొని వెళ్లారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి గోల్కొండ కోటలో అమ్మవారిని దర్శించుకున్నారు

## రూ. 1,393 కోట్లను తక్షణమే చెల్లించండి

హైదరాబాద్

కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్), తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీఎల్) పేరుతో తీసుకున్న రుణాలకు సంబంధించిన రూ. 1,393.65 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ ఈసీ) కోరింది. గడువులోగా బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కా వడంతో ఈ నెల 6న ఆర్‌ఈసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జతిన్‌కుమార్ నాయక్ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకు లేఖ రాశారు. ఈ లేఖను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత గురువారం మీడియా కు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1,393.65 కోట్ల బకాయిల్లో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీ, కేఐపీసీఎల్‌కి సంబంధించి వరుసగా రూ. 319.75 కోట్లు, రూ. 292.75 కోట్లు గత 68 రోజులుగా మొండిబకాయిలుగా మారాయని, వాటిని వరుసగా ఈ నెల 28, 29 తేదీల్లోగా చెల్లించకుంటే ఇరు సంస్థల రుణాలూ నిరర్థక ఆస్తులుగా మారిపోతాయని ఆర్‌ఈసీ పేర్కొంది. రుణాల చెల్లింపుల్లో ఈ తరహా జాప్యం వల్ల ఇరు సంస్థలతోపాటు స్థూలంగా రాష్ట్ర ప్రభుత్వ రుణ పరపతిపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని.. రేటింగ్ పడిపోతోందని హెచ్చరించింది. మే 31 నాటికి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీఎల్, కేఐపీసీఎల్‌కి సంబంధించి వరుసగా రూ. 10,278 కోట్లు, రూ. 17,232 కోట్ల రుణాల చెల్లింపుల్లో జాప్యం జరిగిందని లేఖలో ఆర్‌ఈసీ గుర్తుచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కేఐపీసీఎల్‌కు రూ. 30,536 కోట్ల రుణాన్ని, దేవాదుల, సీతారామ, కంతనపల్లి తదితర ప్రాజెక్టుల నిర్మాణానికి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీఎల్‌కి రూ. 13,517 కోట్ల రుణాలు కలిపి మొత్తం రూ. 44,053 కోట్ల రుణాలను ఆర్‌ఈసీ మంజూరు చేసినప్పటికీ అందులో కేఐపీసీఎల్‌కు రూ. 19,448 కోట్లు, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీఎల్‌కు రూ. 12,618 కోట్లు కలిపి మొత్తం రూ. 28,995 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఈ రు ణాలను గడువులోగా తిరిగి చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పదేపదే విఫలమవుతోందని పేర్కొంటూ గతేడాది నవంబర్ 5న సైతం ఆర్‌ఈసీ లేఖ రాసింది. రుణాలను గడువుకు 75%–%85 రోజుల తర్వాత చెల్లిస్తుండటంతో ప్రభుత్వంపై జరిమానా, వడ్డీల భారం పడుతోందని గుర్తుచేసింది.

**రుణాల పునర్వ్యవస్థీకరణ కుదరదు..**

కేఐపీసీఎల్‌తోపాటు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీఎల్ పేరుతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపు వ్యవధిని పెంచడంతోపాటు వడ్డీలను తగ్గించడం ద్వారా వాటిని పునర్వ్యవస్థీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని ఆర్‌ఈసీ తిరస్కరించింది. రుణాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రుణాల గడువును 2039%–%40 నాటికి పొడిగించాలని కోరుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2030 నాటికి 9 శాతం, 2035 నాటికి 18 శాతం, 2036 నాటికి 27 శాతం, 2040 నాటికి 46 శాతం రుణాలను తిరిగి చెల్లించేలా గడువులను పొడిగించాలని కోరింది. అయితే అది కుదరదని గతేడాది నవంబర్ 5న రాసిన లేఖలో ఆర్‌ఈసీ తేల్చిచెప్పింది. రూ. 30 వేల కోట్ల ఆర్‌ఈసీ రుణాల్లో 71 శాతాన్ని 2029%–%30 నాటికి.. మిగిలిన 29 శాతాన్ని 2035 నాటికి చెల్లించాల్సి ఉంది.

# చరిత్ర సృష్టించిన శుభాన్షు

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాధ్యాయానికి తెరలేచింది. మానవసహిత అంతరిక్ష యాత్ర దిశగా భారీ ముందడుగు పడింది. 140 కోట్ల పై చిలుకు బారతీయుల ఆకాంక్షలను మోసుకుంటూ నిన్న రోదసిలోకి దూసుకెళ్లి, ఆ ఘనత సాధించిన రెండో భారతీయునిగా నిలిచిన మన వాయుసేనాని గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా (39) నేడు మరోచరిత్ర లిఖించారు. గురువారం సాయంత్రం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి విజయవంతంగా ప్రవేశించారు. ఆ ఘనత సాధించిన తొలి భారతీయునిగా చెరిగిపోని రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. శుభాన్షుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు ఇస్రో, నాసా సంయుక్త వాణిజ్య మిషన్ యాగ్జియం%–%4లో భాగంగా స్పేస్ ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ద్వారా బుధవారం విజయవంతంగా నింగికెగిసిన విషయం తెలిసిందే. 28 గంటల పాటు భూ కక్ష్యలో పరిభ్రమించిన అనంతరం భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4 గంటల 1 నిమిషానికి అది భూమి నుంచి 418 కి.మీ.ల ఎత్తున ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. తర్వాత రెండు గంటల పాటు తప్పనిసరి తనిఖీలు, ఐఎస్ఎస్‌తో డ్రాగన్ అనుసంధాన (డాకింగ్) ప్రక్రియ కొనసాగాయి. 12 జతల హుక్కులతో పరస్పరం అనుసంధానమయ్యాయి. తర్వాత డ్రాగన్, ఐఎస్ఎస్ నడుమ సమాచార, ఇంధన లింకేజీ తదితర సంబంధాలు నెలకొన్నాయి. అంతా సజావుగా జరిగిపోయిందని నిర్ధారించుకున్నాక సాయంత్రం 5.44 గంటలకు ఐఎస్ఎస్ మూత తెరుచుకుని తొలుత మిషన్ కమాండర్ పెగ్గీ వాట్సన్ (అమెరికా), ఆ వెనకే శుభాన్షు ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు.
అనంతరం ఉజ్నాన్‌స్కీ విస్నేవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) వారిని అనుసరించారు. ఐఎస్ఎస్‌లోని ఏడుగురు వ్యోమగాములు వారికి చప్పట్ల నడుమ హార్దిక స్వాగతం పలికారు. వెల్కం డ్రింక్‌గా మంచినీళిచ్చి సేదదీర్చారు. శుభాన్షు బృందం ఆనంద హేలను కెమెరాల్లో బంధించి భద్రపరిచారు. అనంతరం పరస్పర ఆలింగనాలు, హై%–%ఫైవ్‌లు, క్షేమ సమాచారాలు తదితరాలతో ఐఎస్ఎస్ సందడిగా మారింది. శుభాన్షు బృందం 14 రోజులపాటు అక్కడ గడపనుంది. 60కి పైగా వినూత్న ప్రయోగాలు చేసి అత్యంత విలువైన సమాచారాన్ని అందించనుంది. ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టిన తొలి భారతీయునిగా కొత్త చరిత్ర సృష్టించిన శుభాన్షుకు దేశ నలుమూలల నుంచీ అభినందన సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన స్వస్థలం లఖ్‌నవూలో తల్లిదండ్రులు తదితరులు హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. భారత్ మాతా కీ జై అంటూ నినదించారు. హంగరీ, పోలండ్ దేశాల నుంచి ఒక వ్యోమగామి ఐఎస్ఎస్‌లో ప్రవేశించడం కూడా ఇదే తొలిసారి. 1984లో రాకేశ్ శర్మ అనంతరం అంతరిక్షంలోకి ప్రవేశించిన రెండో భారతీయునిగా శుభాన్షు నిలవడం తెలిసిందే.

**పాపాయిలా నేర్చుకుంటున్నా**

ఐఎస్ఎస్ నుంచి శుభాన్షు తొలి పలుకులు ఐఎస్ఎస్‌లో ప్రవేశించిన క్షణాలను 'అత్యద్భుతమైనవి'గా శుభాన్షు అభివర్ణించారు. తన అనుభూతిని వీడియో లింకేజ్ ద్వారా అందరితోనూ పంచుకున్నారు. "తొలిసారి సహజమైన, సంపూర్ణమైన భారరహిత స్థితిలో అడుగుపెట్టా. శూన్యంలో తేలిపోతుంటే కలుగుతున్న అనుభూతి వర్ణనాతీతం!. ఇక్కడంతా కొత్త కొత్తగా, గమ్మత్తుగా ఉంది. నేను ఊహించిన దానికంటే కూడా ఎంతో గొప్పగా ఉంది. ఐఎస్ఎస్‌లో ప్రవేశించాక సజావుగా నుంచోవడం నేను అనుకున్న దానికంటే తేలికగానే ఉంది. కెమెరాలకు పోజివ్వడం వంటివన్నీ కూడా ఎంతో సరదాగా ఉన్నాయి. కాకపోతే తలే కాస్త భారంగా అనిపిస్తోంది. పారాడే పాపాయి మాదిరిగా నడక మొదలుకుని అన్నీ మొదటినుంచి కొత్తగా నేర్చుకుంటున్నా. శూన్య స్థితిలో నన్ను నేను నియంత్రించుకోవడానికి ప్రయత్నిస్తున్నా. చివరికి ఎలా తినాలో కూడా నేర్చుకుంటున్న పరిస్థితి!. ఆ క్రమంలో ఎన్నో తప్పటడుగులూ వేస్తున్నా. ఆ పొరపాట్లను పూర్తిగా ఆస్వాదిస్తున్నా. భారరహిత స్థితి అలవాటు లేక నా సహచరులు చేస్తున్న సరదా తప్పిదాలను కూడా అంతే ఎంజాయ్ చేస్తున్నా. ఇక్కడి పరిస్థితులకు మెల్లిగా అలవాటు పడుతున్నా. అద్భుత దృశ్యాలను ఆస్వాదిస్తున్నా. అన్ని విషయాలనూ ఒక్కొక్కటిగా నేర్చుకుంటున్నా. కొత్త వాతావరణం. ప్రతి క్షణమూ సరికొత్త అనుభూతులు. సహచరులతో కలిసి ప్రయోగాలు చేపట్టేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని వివరించారు.

**శూన్యంలో తేలియాడా**

ప్రయోగం పొడవునా ఎదురైన అనుభూతులను శుభాన్షు ఆసక్తికరంగా వివరించారు. "బుధవారం గ్రేస్ (డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌కు శుభాన్షు బృందం పెట్టుకున్న పేరు)లో కూర్చుని ప్రయోగానికి సిద్ధమైన క్షణాల్లో నాలో ఒకే ఆలోచన మెదిలింది. 'సరికొత్త చరిత్ర సృష్టించేందుకు బయల్దేరదాం పదా!' అని నాకు నేను చెప్పుకున్నా. ప్రయోగం మొదలవగానే ఆ విసురుకు నా సీట్లోకి నొక్కుకుపోయా. రోదసిలోకి ప్రవేశించిన తొలి క్షణాల్లో ఏమంత పెద్దగా తేడా అనిపించలేదు. కానీ కాసేపటికే భారరహిత స్థితి తాలూకు మజా అనుభవంలోకి వచ్చింది. 'వావ్! సూపర్ కదా!!' అనిపించింది. ఐఎస్ఎస్ చేరేదాకా ఏకబిగిన 28 గంటల పాటు కదలకుండా కూచుని ఉండటం అలసటగా అన్పించినా చెప్పలేని అనుభూతిని కూడా పంచింది. కాకపోతే చాలాసేపు నిద్రలోనే గడిపా. దాన్ని గుర్తు చేస్తూ నా సహచరులు ఇంకా నన్నెంతగానో ఆటపట్టిస్తున్నారు కూడా" అంటూ శుక్లా చెప్పుకొచ్చారు.

**అంతరిక్షం నుంచి నమస్కారం!**

ఐఎస్ఎస్‌తో అనుసంధానం అయ్యేముందు భారతీయులందరినీ శుభాన్షు ఆప్యాయంగా పలకరించారు. 'అంతరిక్షం నుంచి మీకందరికీ నమస్తే. ఈ అద్భుత యాత్రలో ప్రతి భారతీయుడూ నాకు తోడుగా ఐఎస్ఎస్‌లో ఉన్న భావనే కలుగుతోంది' అని శుభాన్షు అన్నారు. "మీ అందరి ప్రేమ, ఆశీస్సులతోనే ఐఎస్ఎస్ చేరగలిగా. మనమంతా కలిసి ఈ యాత్రను మరింత ఉత్సాహభరితంగా మారుద్దాం. మీ అందరితో పాటు త్రివర్ణ పతాకం వెంట రాగా నాతోపాటు ఐఎస్ఎస్ చేరా. ఇది నా ఒక్కని ఘనత కాదు. భారతీయులందరి విజయం. భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానవసహిత అంతరిక్ష యాత్రకు ఘనమైన ఆరంభం" అంటూ శుభాన్షు హర్షాతిరేకాలు వెలిబుచ్చారు.

**అరగంట ముందుగానే**

డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ అనుకున్న సమయం కంటే అరగంట ముందుగానే ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం వేపాయింట్ 1, 2 వద్ద ఆగకుండా చకచకా ఐఎస్ఎస్‌ను సమీపించడమే అందుకు కారణం. దానికి 20 మీటర్ల సమీపానికి చేరుకున్నాక డ్రాగన్ తుది అప్రోచ్‌కు సిద్ధమైంది. లేజర్ ఆధారిత సెన్సర్లు, కెమెరాల సాయంతో ఐఎస్ఎస్ హార్మనీ మాడ్యూల్ తాలూకు డాకింగ్ పోర్ట్‌తో సవ్యంగా అనుసంధానమైంది. అనంతరం ఐఎస్ఎస్‌లోని ఏడుగురు సిబ్బంది డ్రాగన్‌లో ఏమైనా లీకేజీలు తదితరాలు చోటుచేసుకున్నాయేమో తనిఖీ చేశారు. డ్రాగన్ లోపలి పీడనం ఐఎస్ఎస్‌తో సమానంగా ఉందని నిర్ధారించుకున్నారు. అలా డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిశాక వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టారని నాసా ప్రకటించింది. ఇది దేశమంతటికీ గర్వకారణమని ఇస్రో ఒక ప్రకటనలో పేర్కొంది.

**జాయ్.. ఐదో 'వ్యోమగామి'**

శుభాన్షు, మరో నలుగురితో పాటు యాగ్జియం%–%4 మిషన్ ద్వారా ఐదో వ్యోమగామి 'జాయ్' కూడా ఐఎస్ఎస్ చేరింది! అదెవరా అని ఆశ్చర్యపోతున్నారా? నిజానికి అదొక హంస బొమ్మ!. వ్యోమగాములు జీరో గ్రావిటీ (శూన్య స్థితి)కి చేరగానే వారిని అలర్ట్ చేస్తుందన్నమాట. జీరో గ్రావిటీని సూచించే బొమ్మలను ఇలా అంతరిక్షంలోకి వెంట తీసుకెళ్లడం తొలి రోదసి యాత్రికుడు యూరీ గగారిన్ నాటినుంచీ వస్తున్న ఆనవాయితీ. దానికి కొనసాగింపుగా జాయ్ బొమ్మను యాగ్జియం%–%4 బృందం తమ వెంట తీసుకెళ్లింది.

**శుభాన్షు కుమారుని కోసం..**

శుభాన్షు కుమారుడు కియశ్‌కు జంతువులంటే ఉన్న ప్రేమను దృష్టిలో పెట్టుకుని హంస బొమ్మను ఎంపిక చేసుకున్నట్టు యాగ్జియం%–%4 మిషన్ కమాండర్ వాట్సన్ చెప్పడం విశేషం! పాలను, నీటిని వేరుచేసే హంస భారతీయ సంప్రదాయంలో జ్ఞానానికి అత్యున్నత ప్రతీక అని శుభాన్షు తన సహచర వ్యోమగాములకు వివరించారు.

**నంబర్ 634**

శుభాన్షు అంతరిక్షంలోకి వెళ్లిన 634వ వ్యోమగామిగా నిలిచారు. అందుకు గుర్తుగా ఐఎస్ఎస్‌లో ఆయనకు వ్యోమగామి నంబర్ 634 అంటూ అధికారికంగా స్పేస్ స్టేషన్ పిన్ కేటాయించారు. "నేను ఆస్ట్రోనాట్ నంబర్ 634ను. ఇక్కడ ఉండటం నిజంగా గర్వకారణంగా అనిపిస్తోంది. ఐఎస్ఎస్ నుంచి భూమిని చూసే అవకాశం దక్కిన అతి కొద్ది మందిలో నాకు చోటు దక్కడం ఎంతో ఆనందంగా ఉంది" అని శుభాన్షు వ్యాఖ్యానించారు.

## ఏటా కొత్త మైలురాళ్లు..

# మేడిన్ ఇండియా ఎలక్ట్రానిక్స్


ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ చాలా పురోగతి సాధించింది. దశాబ్దంలో వచ్చిన మార్పును చూస్తే ఔరా అనిపించాల్సిందే. ఇందుకు స్మార్ట్‌ఫోన్స్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు. యాపిల్ ఫోన్లూ భారత్‌లో రూపుదిద్దుకుంటున్నాయి. 2014లో దేశంలో వినియోగించిన ఫోన్లలో 30 శాతంలోపు దేశీయంగా అసెంబుల్ అయితే.. 2024 వచ్చే సరికి ఇది 99 శాతం దాటిందంటే ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత దూకుడును అర్థం చేసుకోవచ్చు. ఉపకరణాల తయారీలో వినియోగించే విడిభాగాలను దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా 'ఎలక్ట్రానిక్స్ హబ్'గా అవతరించే దిశగా భారత్ దూసుకుపోతోంది.

**ఏటా కొత్త మైలురాళ్లు..**

మొబైల్ ఫోన్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్.. ఇలా విభాగం ఏదైనా తయారీపరంగా భారత్‌లో ఏటా కొత్త మైలురాళ్లు నమోదవుతున్నాయి. దేశంలో తయారైన ఎలక్ట్రానిక్స్ విలువ 2014%–%15లో రూ. 1.9 లక్షల కోట్లుగా ఉంటే 2023%–%24 నాటికి ఐదురెట్లు పెరిగి రూ. 9.5 లక్షల కోట్లకు చేరుకోవడం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్‌లో జరుగుతున్న పురోగతికి నిదర్శనం.
అయితే మొబైల్ ఫోన్ల అసెంబ్లింగ్ కొత్త రికార్డులకు ప్రధానంగా రూ. 1.9 లక్షల కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కారణం. 2024%–%25లో భారత్ నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు రూ. 2 లక్షల కోట్లు దాటాయి. ఎలక్ట్రానిక్స్ తయారీలో వినియోగించే విడిభాగాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు పీఎల్ఐ పథకం ప్రకటించడం ఈ రంగంలో పెద్ద అడుగు పడినట్టు అయింది.

**ఈసీఎంఎస్‌తో ఊతం..**

విడిభాగాల తయారీ కంపెనీలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ. 22,919 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకం (ఈసీఎంఎస్) ప్రారంభించింది. ఈ పథకం



2031%–%32 వరకు కొనసాగుతుంది. కెమెరా మాడ్యూల్స్, డిస్‌ప్లేలు, మల్టీ లేయర్ పీసీబీలు సహా వివిధ విడిభాగాల తయారీని ప్రోత్సహించనుంది. రూ. 59,350 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, రూ. 4.5 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి సాధించడం, కొత్తగా 91,600 మందికి ప్రత్యక్షంగా ఉపాధిని కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి ఇప్పటికే 70 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 80% చిన్న, మధ్యతరహా కంపెనీలు ఉన్నాయి. టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, డిక్సన్ టెక్నాలజీస్ వంటి పెద్ద కంపెనీలు సైతం దరఖాస్తు చేసిన కంపెనీల జాబితాలో ఉన్నాయని సమాచారం.

**అసెంబ్లింగ్‌ను మించితేనే..**

ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ ఎదగాలంటే విడిభాగాల తయారీలో దూసుకుపోవాలి. అసెంబ్లింగ్‌కు పరిమితం కాకుండా తయారీ దిశగా అభివృద్ధి చెందాలన్నది నిపుణుల అభిప్రాయం. మొబైల్ ఫోన్లను తయారు చేయడానికి దేశీయంగా ఉన్న ఎలక్ట్రానిక్ తయారీ సేవలు లేదా కాంట్రాక్ట్ తయారీ కంపెనీలు కెమెరాలు, డిస్‌ప్లేలు, హై%–%ఎండ్ బ్యాటరీ ప్యాక్‌లు, సెమీకండక్టర్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల వంటి కీలక భాగాల దిగుమతులపై ఆధారపడుతున్నాయి. ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులైన స్మార్ట్ టీవీలు, సీసీటీవీ కెమెరాలు, కంప్యూటర్లు, వేరబుల్స్, హియరబుల్స్‌ను సైతం దిగుమతి చేసుకున్న విడిభాగాలతోనే అసెంబుల్ చేస్తున్నారు. విడిభాగాలు ఇప్పటికీ చైనా, కొరియా, తైవాన్ నుంచి ప్రధానంగా సరఫరా అవుతున్నాయి. ఎలక్ట్రానిక్స్ విడిభాగాల విలువలో దిగుమతుల వాటా ఏకంగా 85%–%90% ఉందని ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## రాజ్యాంగమే సుప్రీం



అమరావతి (మహారాష్ట్ర)

దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మరోసారి తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యంలోని శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు రాజ్యాంగానికి లోబడి పనిచేయాల్సిందేనని పేర్కొన్నారు. రాజ్యాంగానికి సవరణలు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం మాత్రం లేదని గతంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు గుర్తుచేశారు. 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్ గత నెలలో ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలోని అమరావతి పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను తాజాగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ అత్యున్నతమని కొందరు చెబుతుంటారని, కానీ, తన ఉద్దేశంలో రాజ్యాంగమే సుప్రీం అని స్పష్టంచేశారు. అలాగే ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల్లో ఏది అత్యున్నతం అనే చర్చ కూడా సాగుతోందని, నిజానికి రాజ్యాంగం పరిధిలోనే ఈ మూడు విభాగాలూ పనిచేయాలని ఉద్ఘాటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇచ్చే అధికారం ఉన్నంత మాత్రాన ఒక న్యాయమూర్తి తనను తాను స్వతంత్రుడిగా భావించుకోవడానికి వీల్లేదన్నారు. పౌరుల హక్కులను, రాజ్యాంగ విలువలను, సూత్రాలను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తిపై ఉందని, అది అతడి విద్యుక్త ధర్మమని చెప్పారు.

## టూ వీలర్లపై టోల్ చార్జీలుండవ్

న్యూఢిల్లీ




జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు ఎటువంటి టోల్ చార్జీలను తాము విధించడం లేదని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) స్పష్టం చేసింది. జూలై 15 నుంచి దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులపై టూ వీలర్లకు కూడా టోల్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు జాతీయ మీడియాలో వస్తున్న కథనాలన్నీ అవాస్తవమని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. ఇటువంటి కట్టుకథలు, తప్పుడు వార్తలను ఎవరూ నమ్మొద్దని కోరారు. 'ద్వి చక్రవాహనాలకు టోల్ రుసుము వసూలు ప్రతిపాదనేదీ మా పరిశీలనలో లేదు. అటువంటి యోచన చేయడం లేదు. టూ వీలర్స్‌కు టోల్ ఛార్జీలంటూ వచ్చేవన్నీ ఫేక్ వార్తలు' అంటూ ఎన్‌హెచ్ఏఐ, మంత్రి గడ్కరీ వేర్వేరుగా సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ఫోర్ వీలర్స్, భారీ వాహనాలకు మాత్రమే టోల్ వసూలు చేస్తున్నారు. ఈ విధానంలో మార్పునకు కేంద్రం శ్రీకారం చుట్టినట్లు ప్రముఖ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. దీంతో, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీరును నెటిజన్లు సోషల్ మీడియాలో తప్పుబట్టారు. అసత్యాల ప్రచారంపై ఎన్‌హెచ్ఏఐ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు స్పష్టతనిచ్చారు.

## ఎన్నికల్లో చేసే ప్రసంగాలపై కేసులా?

హైదరాబాద్

"ఎన్నికల సమయంలో చేసే రాజకీయ ప్రసంగాలపై కూడా కేసులు పెడతారా? ఇది సరికాదు. బీజేపీ ప్రతినిధి కాసం వెంకటేశ్వర్లు పెట్టిన కేసుకు విచారణార్హత లేదు" అని సీఎం రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఎన్నికల సందర్భంలో అన్ని పార్టీల నాయకులు రాజకీయ ప్రసంగాలు చేస్తారని, అది సర్వసాధారణమని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో నిర్వహించిన జనజాతర సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తేస్తారని వ్యాఖ్యానించడంతోపాటు అమిత్ షా మాట్లాడినట్లుగా ఉన్న ఫేక్ వీడియోను వైరల్ చేశారంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదించారు. "బీజేపీ ప్రతినిధి కాసం వెంకటేశ్వర్లు దాఖలు చేసిన ప్రైవేటు ఫిర్యాదుకు విచారణార్హత లేదు. ఈ ఫిర్యాదు దాఖలు చేయడానికి ఆయనకు ఎవరు అనుమతి ఇచ్చారు? బీజేపీ నుంచి అధికారికంగా సమాచారం వచ్చిందా? కాసం దాఖలు చేసిన ఫిర్యాదు తప్పుల తడక. దురుద్దేశంతో కూడుకున్నది. రేవంత్‌రెడ్డి ప్రసంగం వల్ల బీజేపీకి పరువునష్టం కలిగిందని నిరూపించడానికి తగిన ముడి సరుకు లేదు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా, ఒక రాజకీయ పార్టీ ప్రతినిధిగా మాట్లాడారే తప్ప ముఖ్యమంత్రిగా కాదు. ఎన్నికల సమయంలో చేసిన రాజకీయ ప్రసంగాన్ని ఆధారంగా చేసుకొని ఫిర్యాదు చేశారు. రాజకీయ ప్రసంగాలకు పరువు నష్టం ఆపాదించడం ఉండదు. ఆర్టికల్ 19 ప్రకారం.. మాట్లాడే స్వేచ్ఛలో భాగంగానే రాజకీయాలపై మాట్లాడతారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పెంచుతారని బీజేపీ నేతలూ విమర్శలు గుప్పిస్తుంటారు. అది కూడా పరువునష్టం కిందికే వస్తుందా? అలా అయితే బీజేపీపై చాలా కేసులు పెట్టాల్సి ఉంటుంది. కాబట్టి రాజకీయ నేతలు చేసే ప్రసంగాలను పరువునష్టంగా భావించడం ఉండదు' అని రేవంత్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి విచారణ జూలై 2కు వాయిదా పడింది.

**కేంద్ర మాజీ మంత్రి సర్వేపై కేసు కొట్టివేత**


కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణపై 2018 ఎన్నికల సందర్భంగా నమోదైన ఓ కేసును హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల సందర్భంగా పట్టుబడ్డ రూ.50 లక్షలు సర్వే సత్యనారాయణకు చెందినవని ఓ నిందితుడు చెప్పడంతో ఆయనపై కేసు పెట్టారు. కేవలం స్టేట్‌మెంట్ ఆధారంగా విచారణ జరపడానికి అవకాశం లేదని పేర్కొంటూ సర్వేపై కేసును హైకోర్టు కొట్టేసింది. మరోవైపు బీసీ బంధు ఇవ్వాలంటూ అనుమతి లేకుండా ధర్నా చేసిన వ్యవహారంలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుపై నమోదైన కేసును కూడా హైకోర్టు కొట్టివేసింది. 144 సెక్షన్ అమల్లో ఉండగా స్టేషన్‌లోకి వెళ్లి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ నమోదైన మరో కేసులో ఎంపీ రఘునందన్ దర్యాప్తు ఎదుర్కోవాలని హైకోర్టు పేర్కొంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది.

# పలు ప్రత్యేకతల సమాహారం జగన్నాథ రథోత్సవం



ఏ హిందూ ఆలయంలోనైనా ఊరేగింపు కోసం మూల విరాట్టును కదిలించే కార్యక్రమం దాదాపు ఉండదు. ఊరేగింపు సేవల కోసం ప్రత్యేకించి ఉత్సవ విగ్రహాలుంటాయి. అలాగే ఊరేగింపు కోసం ప్రత్యేకించి ఏటా ఒకే రథాన్ని వినియోగించడం అన్ని చోట్లా జరిగేదే. అయితే ఈ రెంటికీ భిన్నమైన పరిస్థితి భారత దేశంలో ఒక సమయంలో ఉంది. అది మామూలు ఆలయం కాదు. పలు ప్రత్యేకతలు కలిగిన ప్రఖ్యాత ఆలయం. అదే ఒడిశాలోని పూరీ జగన్నాథాలయం. బలభద్ర, సుభద్రలతో సహా ఈ ఆలయంలో కొలువైన జగన్నాథ మూల విరాట్ మూర్తులను ఏడాదికొకసారి గుడి లోంచి బయటికి తీసుకువచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, కనువిందు చేసే ప్రత్యేక సన్నివేశం పూరీకే అపురూపం. అంతేకాదు. జగన్నాథ రథయాత్ర పేరుతో నిర్వహించే కార్యక్రమాలకు ఏటా కొత్త రథాలను తయారు చేసి వినియోగిస్తుండడం పూరీ జగన్నాథుడికే ప్రత్యేకం. అందుకే... జగన్నాథుడి రథ యాత్రను అత్యంత అపురూపంగా భావిస్తారు భక్తులు. పూరీ జగన్నాథ దేవాలయం భారతదేశం లోని ఒడిషా రాష్ట్రంలో బంగాళాఖాతం తీరాన ఉన్న పూరీ పట్టణంలో గల ఒక ప్రాచీన, ప్రముఖమైన హిందూ దేవాలయము. విగ్రహాలు చెక్కతో తయారు చేసి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆలయంలో శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరామ సమేతంగా దర్శన మిస్తాడు. ఛార్ థాం" పుణ్యక్షేత్రాలలో ఈ దేవాలయం కూడా ఉంది. ఆషాఢ శుద్ధవిదియ... పూరీ క్షేత్రంలో రథోత్సవ పండుగ రోజు. జగన్నాథ జయజయ ధ్వనాలతో పూరీ నగర వీధులన్నీ మారుమోగు తుంటాయి. అంతరాలయంలో రత్న పీఠికపై ఏడాదిగా కొలువున్న జగన్నాథుడు బయటికి వచ్చే సమయం కోసం వేచి చూస్తుంటారు భక్తులు. ఆ క్షణం అపురూపం, అనిర్వచనీయం. రథయాత్ర నేపథ్యం గురించి రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ద్వాపర యుగంలో కంసుడిని వధించడానికి బలరామ కృష్ణులు బయలుదేరిన ఘట్టాన్ని పురస్కరించుకుని ఈ యాత్ర జరుపుతారని ఒక కథనం. ద్వారకకు వెళ్లాలన్న సుభద్రా దేవి కోరిక తీర్చే ముచ్చటే ఈ రథయాత్ర అని మరి కొందరు చెబుతారు. ఇక గుండీచా దేవి మందిరం విషయానికొస్తే... పూరీ జగన్నాథ ఆలయాన్ని నిర్మించిన ఇంద్రద్యుమ్న మహారాజు భార్య గుండీచా. ఆమె కూడా జగన్నాథ బలభద్రుల కోసం ప్రధానాలయానికి మూడు కి.మీ. దూరంలో ఒక మందిరం నిర్మించింది. అదే గుండీచా ఆలయం. రథయాత్రలో భాగంగా అక్కడికి తీసుకువెళ్లిన మూడు విగ్రహాలనూ ఆ గుడిలోని రత్న సింహాసనంపై కూర్చుండ. బెట్టి గుండీచాదేవి పేరిట ఆతిథ్యం ఇస్తారు. గుండీచా మందిరం జగన్నాథుడి అతిథి గృహంగా భావిస్తారు. జగన్నాథ రథయాత్ర జరిగేది ఆషాఢ శుద్ధ విదియ నాడే అయినా అందుకు రెండు నెలల ముందు నుంచే ఏర్పాట్లు మొదలవుతాయి. వైశాఖ బహుళ విదియ నాడు రథ నిర్మాణానికి కావలసిన ఏర్పాట్లు ప్రారంభిస్తారు. అందుకు అవసరమైన వృక్షాలను 1072 ముక్కలుగా ఖండించి పూరీకి తరలిస్తారు. ప్రధాన పూజారి, తొమ్మిది మంది ముఖ్య శిల్పులు, వారి సహాయకులు మరో 125 మంది కలిసి అక్షయ తృతీయ నాడు రథ నిర్మాణం మొదలు పెడతారు. వృక్ష భాగాలనూ నిర్మాణానికి అనువుగా ముక్కలుగా ఖండిస్తారు. వాటిలో 832 ముక్కల్ని జగన్నాథుడి రథం తయారీకీ, 763 కాండాలను బలరాముడి రథ నిర్మాణానికీ, 593 భాగాలను సుభద్రా దేవి రథానికీ వినియోగిస్తారు. 45 అడుగుల ఎత్తున జగన్నాథుడి రథం పదహారు చక్రాలతో మిగతా రెండిటి కన్నా పెద్దదిగా ఉంటుంది. ఎర్రటి చారలున్న పసుపు వస్త్రంతో రథాన్ని అలంకరిస్తారు. బలభద్రుడి రథం ఎత్తు 44 అడుగులు. పద్నాలుగు చక్రాలుంటాయి. ఎర్రటి చారలున్న నీలి వస్త్రంతో ఈ రథాన్ని కప్పుతారు. సుభద్రా దేవి రథం ఎత్తు 43 అడుగులు. పన్నెండు చక్రాలుంటాయి. ఎర్రటి చారలున్న నలుపు వస్త్రంతో పద్మ. ధ్వజాన్ని అలంకరిస్తారు. ప్రతి రథానికీ 250 అడుగుల పొడవూ ఎనిమిది అంగుళాల మందం ఉండే తాళ్లను కడతారు. ఆలయ తూర్పు భాగంలో ఉండే సింహ ద్వారానికి ఎదురుగా ఉత్తర ముఖంగా నిలబెడతారు. రథయాత్ర ప్రారంభ దినాన మేళ తాళాలతో గర్భగుడి లోకి వెళ్లిన పండాలు (పూజరులు) ఉదయ కాల పూజాదికాలు ముగించి, 'మనిమా (జగన్నాథా)' అని పెద్దపెట్టున అరుస్తూ రత్నపీఠం మీద నుంచి విగ్రహాలను కదిలిస్తారు. ఆలయ ప్రాంగణం లోని ఆనంద బజారు, అరుణ స్తంభం మీదుగా వాటిని వూరేగిస్తూ బయటికి తెస్తారు. ముందుగా... దాదాపు ఐదున్నర అడుగుల ఎత్తుండే బలరాముడి విగ్రహాన్ని తీసుకు వస్తారు. విగ్రహాన్ని ఆయన రథమైన తాళ ధ్వజంపై ప్రతిష్ఠింప జేస్తారు. అనంతరం ఆ స్వామి విగ్రహానికి అలంకరించిన తలపాగా ఇతర అలంకరణలను తీసి భక్తులకు పంచుతారు. ఇదే పద్ధతిలో సుభద్రా దేవి విగ్రహాన్ని కూడా బయటికి తీసుకువచ్చి పద్మ ధ్వజం అనే రథం మీద ప్రతిష్ఠిస్తారు. ఇక దాదాపు ఐదడుగుల ఏడంగుళాల ఎత్తుండే జగన్నాథుడి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో నుంచి బయటికి తీసుకు వస్తుండగానే జయహో జగన్నాథా అంటూ భక్తి పారవశ్యంతో జయజయ ధ్వనాలు చేస్తారు. కులమత భేదాలు లేకుండా అందరూ జగన్నాథుడి విగ్రహాన్ని తాకవచ్చు. ఈ మూడు విగ్రహాలనూ తీసుకువచ్చే వారిని దైత్యులు అంటారు. ఇంద్రద్యుమ్న మహారాజుకన్నా ముందే ఆ జగన్నాథుడిని నీలమాధవుడి రూపంలో అర్చించిన సవరతెగ రాజు విశ్వావసు వారసులు వారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం... మూల విరాట్టులను అంతరాలయం నుంచి బయటికి తీసుకు వచ్చి రథాల మీద ప్రతిష్ఠింపచేసే అర్హత వీరికి మాత్రమే ఉంటుంది. సుభద్ర, జగన్నాథ, బలభద్రులు రథారూఢులై యాత్రకు సిద్ధం కాగా, పూరీ సంస్థానాధీశులు అక్కడికి చేరుకుని జగన్నాథుడికి నమస్కరించి రథం మీదికి ఎక్కి స్వామి ముంగిట బంగారు చీపురుతో శుభ్రం చేస్తారు. అనంతరం స్వామిపై గంధం నీళ్లు చిలకరించి కిందికి దిగి రథం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేస్తారు. ఇదే తరహాలో బలరాముడినీ, సుభద్రా దేవినీ అర్చించి వారి రథాల చుట్టూ కూడా ప్రదక్షిణ చేస్తారు. జగన్నాథుడి రథం మీదుండే ప్రధాన పండా నుంచి సూచన రాగానే కస్తూరి కళ్లాపి చల్లి హారతిచ్చి... జై జగన్నాథా అని పెద్దపెట్టున అరుస్తూ తాళ్లను పట్టుకుని రథాన్ని లాగడం మొదలు పెడతారు. విశాలమైన బోడోదండ (ప్రధానమార్గం) గుండా యాత్ర మంద గమనంతో సాగుతుంది. అతి నెమ్మదిగా జగన్నాథుడి గుడి నుంచి కేవలం మూడు మైళ్ల దూరంలో ఉండే గుండీచా గుడికి చేరుకోవడానికి దాదాపు పన్నెండు గంటల సమయం పడుతుంది. గుండీచా ఆలయానికి చేరుకున్నాక ఆ రాత్రి బయటే రథాల్లోనే మూలవిరాట్లకు విశ్రాంతినిస్తారు. మర్నాడు ఉదయం మేళ తాళాలతో గుడిలోకి తీసుకు వెళతారు. వారం రోజులపాటు గుండీచా దేవి ఆతిథ్యం స్వీకరించిన అనంతరం దశమినాడు తిరుగు ప్రయాణం మొదలవుతుంది. ఆ రోజు మధ్యాహ్నానికి మూడు రథాలూ జగన్నాథ ఆలయానికి చేరుకుని గుడి బయటే ఉండి పోతాయి. మర్నాడు ఏకాదశినాడు స్వామి వార్లను బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. ఈ వేడుకను చూసేందుకు బారులు తీరుతారు భక్తులు. ద్వాదశి నాడు విగ్రహాలను మళ్లీ గర్భగుడి లోని రత్న సింహాసనంపై అలంకరించడంతో యాత్ర పూర్తి అవుతుంది. చివరగా శ్రీ మందిరం రత్న వేదికకు యథావిధిగా చేరుతాయి. రథాల పైకి తరలించే మూల విరాట్లను తరలించడంతో మొదలై రత్న వేదికపైకి చేర్చడంతో వార్షిక రథయాత్రకు తెర పడుతుంది. ఒడిశాలో అతి ముఖ్యమైన పండుగలలో ఒకటిగా భావించబడే జగన్నాథ రథయాత్ర జూన్ 27, 2025న ఆ షాఢ మాసంలో శుక్ల పక్షంలోని ద్వితీయ తిథి శుక్ర వారం నాడు జరుపుకుంటారు.

# అసమాన యోధుడు జనరల్ మానెక్‌షా



ఆయన యుద్ధ వీరుడు. సాహస సైనికుడు. సమర్థ నాయకుడు. అయిదు యుద్ధాలలో పాల్గొని, తుపాకీ గుళ్ళు శరీరంలో దిగినా, విశ్రమించని పోరాట యోధుడు. పాకిస్తాన్ యుద్ధ విజయ సారథి. ఆయనే ధైర్య సాహసాలకు మారు పేరుగా నిలిచిన భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా. అయన పూర్తి పేరు శాం హెూర్ముస్‌జీ ఫ్రేంజీ జెమ్‌షెడ్జీ మానెక్ షా (ఏప్రిల్ 3, 1914 %-% జూన్ 27, 2008). 1971లో పాకిస్తాన్తో యుద్ధంలో భారత్‌కు అతిపెద్ద సైనిక విజయాన్ని సాధించి పెట్టిన ఆయన బంగ్లాదేశ్ ఆవిర్భావానికి అద్యుడయ్యారు. 1914 ఏప్రిల్ 3వ తేదీన అమృతసర్ లోని పార్శీ దంపతులకు మానెక్‌షా జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుజరాత్ రాష్ట్రంలోని వల్సాద్ అనే చిన్న పట్టణం నుంచి అమృతసర్, పంజాబ్ రాష్ట్రంకు వలస వెళ్ళారు. అమృతసర్, నైనిటాల్‌లలో పాఠశాల విద్య పూర్తయ్యాక డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో క్యాడెట్‌గా తొలి బ్యాచ్‌లో మానెక్ షా చేరారు. 1934లో ఆయన సైన్యంలో రెండో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. జూన్ 7, 1969 న జనరల్ కుమార మంగళం నుండి 8వ సైనిక దళాల ప్రదానాదికారిగా బాధ్యతలు స్వీకరించి 15, జనవరి 1973 న పదవీ విరమణ చేసారు. బ్రిటిష్ పాలనా కాలం మొదలుకొని నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో సేవలు అందజేసిన శాం మానెక్‌షా- రెండవ ప్రపంచ యుద్ధంలోను, భారత స్వాతంత్ర్యానంతరం చైనా, పాకిస్థాన్‌లతో జరిగిన మూడు యుద్ధాల సందర్భంగాను ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధి కుశలత అమోఘమైనవి. రెండో ప్రపంచ యుద్ధం జరుగు తున్నప్పుడు జపాన్ ఆక్రమిత దళాలను తిప్పి కొట్టేందుకు ఉద్దేశించిన సైనిక విభాగం అధిపతిగా బర్మాలో ఆయన ప్రాణాలొడ్డి పోరాడారు. కడుపులోకి ఏడు గుళ్లు దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు ఇచ్చే అత్యున్నత పతకం 'మిలిటరీ క్రాస్'ను మృతులకు ప్రకటించ రాదన్నది నియమం. మానెక్‌షా బతికి బట్టకట్టక పోవచ్చునని భావించిన నాటి మేజర్ జనరల్ డి.టి.కోవన్, తన 'మిలిటరీ క్రాస్ రిబ్బన్'ను తక్షణం మానెక్‌షాకు ప్రదానం చేశారు. అదృష్టవశాత్తు మృత్యుముఖం లోంచి బయట పడిన మానెక్‌షా, మరోసారి బర్మాలో జపాన్ సైనికులను ఢీకొన్నారు. మళ్ళీ గాయ పడినప్పటికీ వెన్ను చూపలేదు. జపాన్ సైనికులు లొంగిపోయాక, 10 వేల మందికిపైగా యుద్ధ ఖైదీలకు పునరావాసం కల్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. 1947లో దేశవిభజన, 1947-48లో జమ్ము కాశ్మీర్‌లో సైనిక చర్యల సందర్భంగా ఆయన తన పోరాటపటిమను మరోమారు లోకానికి చాటి చెప్పారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం ఆయన వ్యూహ నైపుణ్యానికి, దీక్షాదక్షతలకు అద్దం పట్టింది. ఆ యుద్ధంలో పాక్ చిత్తుగా ఓడిపోవడమే కాదు, 45,000 మంది పాక్ సైనికులు, మరో 45,000 మంది పౌరులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. తరువాత బంగ్లా ఆవిర్భావానికి దోహద పడిన సిమ్లా అంగీకారం కుదర్చడంలోనూ ఆయనది కీలక భూమికే. ఆయన సమర్థ సారథ్యం దేశసైనిక దళాల్లో సరికొత్త విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1973 జనవరిలో మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి కల్పించి, ఆయనను సముచిత రీతిలో గౌరవించింది. 1971 ఆరంభంలో తూర్పు పాకిస్థాన్ నుంచి పెద్దయెత్తున శరణార్థులు భారత్‌లోకి వస్తున్న సమస్యపై ఆ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన క్యాబినెట్ సమావేశానికి త్రివిధ దళాధిపతుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మానెక్‌షానూ ఆహ్వానించారు. ఈ సమస్యని పరిష్కరించడానికి తక్షణం సైనికులని పంపాలన్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నిర్ణయాన్ని వాతావరణం అనుకూలంగా లేదన్న కారణముతో ఒప్పుకోకుండా, వెంటనే యుద్ధానికి దిగక తప్పదంటే మానసిక లేదా శారీరక అనారోగ్య కారణాలపై రాజీనామా చేయడానికీ తాను సిద్ధమే అనడం ద్వారా తన నాయకత్వ లక్షణాలని చాటిన ఈయన, తన సమర్థ వాదనతో క్యాబినెట్‌ను ఒప్పించి 1971 డిసెంబరులో, అన్ని విధాలా సానుకూల పరిస్థితుల్ని చూసుకొని పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించి, అద్భుత విజయం సాధించి చూపి తన నిర్ణయం ఎంత సరియినదో నిరూపించి వ్యూహ కర్తగా ఆయన చతురతను చాటిచెప్పిన వైనం అద్వితీయం. మీ యుద్ధ విమానాలు నాశనం చేశాం, మిమ్మల్నందరిని మా సైనికులు చుట్టూ ముట్టి వున్నారు. లొంగిపోక పొతే నిర్ధాక్షంగా చంపేస్తాం అంటూ పాకిస్తాను సైనికులని కఠినంగా హెచ్చరించి శత్రువులని లొంగదీసుకున్న గొప్ప తనం ఆయనకే సొంతం. శాం మానెక్‌షా గొప్ప వక్త కూడా. ముక్కు సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. భారత సమాజాన్ని నాయకత్వ కొరతే పట్టి పీడిస్తోందంటూ ఒక సందర్భంలో ధైర్యంగా దాపరికం లేకుండా చెప్పారు. అన్ని రంగాల్లో నాయకత్వ కొరతే దేశంలోని అస్తవ్యస్త పరిస్థితులకు కారణమని స్పష్టం చేశారు. వృత్తిపరమైన సామర్థ్యం, విజ్ఞానం, నిజాయతీ, నిష్పాక్షికత, ధైర్యం, విశ్వసనీయత, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత - ఇవీ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలని వివరించి, లక్షలమంది సైనికులకు, సైనికులుగా చేరాలనుకున్న వారికే కాకుండా సామాన్యులకి కూడా స్ఫూర్తిగా నిలిచారు. భారత్‌కు ఎన్నో విజయాలను అందించిన యుద్ధ సేనాని మానెక్ షా జూన్ 26, 2008 గురువారం అర్ధరాత్రి 94ఏళ్ల వయస్సులో మృతి చెందారు.

# ప్రసూతి సెలవు.. మహిళల హక్కు

మే 23, 2025 ఇది భారతీయ స్త్రీల జీవితంలో ఒక చరిత్రాత్మక దినం. ఉద్యోగాలు చేసే మహిళల హక్కులు, ముఖ్యంగా ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీం కోర్టు ఒక అద్భుతమైన తీర్పును వెలువరించింది. కె ఉమాదేవి వెర్సెస్ ది స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో మద్రాస్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రసూతి సెలవు అనేది కేవలం ఒక విధానపరమైన అంశం కాదని, అది ఒక రాజ్యాంగ హక్కు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆర్థిక, ప్రసూతి హక్కుల పరిధిని విస్తరింపజేస్తూ, పని ప్రదేశంలో మహిళల పునరుత్పత్తి స్వేచ్ఛకు, గౌరవానికి అగ్రపీఠం వేసింది. ఈ కేసు ఉమాదేవి అనే ఉద్యోగిని చుట్టూ తిరిగింది. ఆమె తన రెండో వివాహం తర్వాత పుట్టిన మూడో బిడ్డకు ప్రసూతి సెలవు కోరారు. తమిళనాడు ప్రభుత్వం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. అంతకు ముందు మద్రాస్ హైకోర్టు కూడా ఆమె సెలవును నిరాకరించింది. జనాభా నియంత్రణ లక్ష్యాలను ఉటంకిస్తూ మూడో బిడ్డకు ప్రసూతి సెలవును నిరాకరించే తమిళనాడు ప్రభుత్వ విధానాన్ని హైకోర్టు సమర్థించింది. అయితే సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో ఉమాదేవికి పూర్తిగా అనుకూలంగా నిలిచింది. అటువంటి వివక్షాపూరిత వ్యాఖ్యానాలను కొట్టివేసింది. పిల్లల సంఖ్య లేదా వైవాహిక పరిస్థితుల ఆధారంగా ప్రసూతి సెలవును నిరాకరించడం లేదా పరిమితం చేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. ప్రసూతి ప్రయోజనాలు ఒక మహిళ పునరుత్పత్తి హక్కులు, ప్రాథమిక గౌరవం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన ఆరోగ్య హక్కులో అంతర్భాగమని కోర్టు నొక్కిచెప్పింది. అటువంటి వివక్షాపూరిత నిబంధనలు మహిళలపై 'అన్యాయమైన భారాన్ని' సృష్టిస్తాయని, వారి కెరీర్, కుటుంబం మధ్య ఎంపిక చేసుకోవలసి వస్తుందని లేదా వారి పునరుత్పత్తి నిర్ణయాలు తీసుకునే హక్కును అణగదొక్కుతాయని తీర్పు నొక్కి చెప్పింది. ఈ తీర్పు ప్రసూతి ప్రయోజనాలను కేవలం ఒక సేవా షరతు నుండి ఒక మహిళ పునరుత్పత్తి స్వేచ్ఛ ప్రాథమిక అంశంగా మార్చింది. ఆర్టికల్ 14 (చట్టం ముందు సమానత్వం), ఆర్టికల్ 21 (జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ రక్షణ)లతో అనుసంధానించడం ద్వారా, కోర్టు ప్రసూతి హక్కులకు పటిష్టమైన రాజ్యాంగ ఆధారాలను అందించింది. ఇప్పటి వరకు మన దేశంలో ప్రసూతి హక్కులు ప్రధానంగా ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961 ద్వారా నియంత్రించబడ్డాయి. ఇది 2017లో మరింత సమగ్ర ప్రయోజనాలను అందించడానికి సవరించబడింది. ఈ చట్టం గర్భధారణ సమయంలో, తర్వాత పని చేసే మహిళలకు కొన్ని రక్షణలు, ప్రయోజనాలను అందిస్తుంది. వేతనంతో కూడిన సెలవు, తొలగింపునుండి రక్షణ, ఇతర ప్రసూతి సంబంధిత ప్రయోజనాలను అందిస్తుంది. సెలవు తర్వాత అదే లేదా సమానమైన స్థానానికి తిరిగి రావడానికి హామీ ఇస్తుంది. అయితే ఈ చట్టాలు సాధారణంగా 'రెండు కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న' మహిళలకు ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేశాయి. చాలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సేవల్లో సాధారణంగా ఉన్న ఈ విధానం వివక్షాపూరితమైనదిగా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. ఈ తీర్పు భారతదేశంలో ఆర్థిక, ప్రసూతి హక్కుల దృశ్యంపై లోతైన, తక్షణ ప్రభావాలను చూపుతుంది. ఇద్దరు పిల్లల నిబంధన లేదా ఇలాంటి ఆంక్షల ద్వారా గతంలో పరిమితం చేయబడిన ప్రభుత్వ ఉద్యోగులపై దీని ప్రభావం ప్రత్యక్షంగా ఉంటుంది. ఈ తీర్పు ఇప్పుడు వారికి పిల్లల సంఖ్యలేదా వైవాహిక సందర్భంతో సంబంధం లేకుండా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు అనుమతిస్తుంది, వారి జీవితంలో ఒక కీలక సమయంలో కీలక ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఈ నిర్దిష్ట కేసు ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించినది అయినప్పటికీ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన బలమైన రాజ్యాంగ సూత్రాలు ప్రైవేట్ రంగంతో సహా ఇతర రంగాలలో ఇలాంటి వివక్షాపూరిత పద్ధతులను సవాలు చేయడంలో గణనీయంగా ఉపయోగపడతాయి. పిల్లల సంఖ్య ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్న ఏ సంస్థ అయినా ఇప్పుడు చట్టపరమైన సవాలును ఎదుర్కోవలసి ఉంటుంది. కుటుంబ పరిమాణం ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను నిరాకరించడం తరచుగా మహిళలను, ముఖ్యంగా పునర్వివాహం చేసుకున్న లేదా వివిధ కారణాల వల్ల ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న వారిని అసమానంగా ప్రభావితం చేస్తుంది. అసంఘటిత రంగాలలో పనిచేసే మహిళలకు ఆర్థిక ప్రసూతి హక్కులను విస్తరించడం అనే విస్తృత సమస్య ఇంకా మిగిలి ఉంది. ఈ మహిళలకు తరచుగా వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, వైద్య బోనస్, లేదా శిశుసంరక్షణ సౌకర్యాలు వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలు అందుబాటులో ఉండవు. గర్భధారణ సమయంలో వారి దుర్బలత్వం తరచుగా వారిని అకాలంగా పనికి తిరిగి వెళ్ళడానికి లేదా మరింత పేదరికంలోకి నెట్టివేస్తుంది. ఈ ప్రగతిశీల తీర్పు స్ఫూర్తిని ఉపయోగించుకొని మరింత సమ్మిళితమైన, సార్వత్రిక సామాజిక భద్రతా చట్టాలను రూపొందించడం తదుపరి కీలక అడుగు. తద్వారా అసంఘటిత రంగానికి కూడా ఆర్థిక ప్రసూతి సహాయాన్ని అందించడం ఈ మే 23, 2025 తీర్పు మహిళల హక్కులను పునరుద్ఘాటిస్తుంది. మాతృత్వం ఉద్యోగానికి అడ్డంకి కాకూడదని లేదా ఆర్థిక ఇబ్బందులకు కారణం కాకూడదని వాదిస్తుంది. ఇది ఆశకు ఒక దీపస్తంభంగా పనిచేస్తుంది. ప్రసూతి ప్రయోజనాల రక్షక గొడుగును విస్తరిస్తుంది. ప్రతి తల్లి ఆమె ఉద్యోగ రంగంతో సంబంధం లేకుండా, గౌరవంగా, ఆర్థిక భద్రతతో మాతృత్వాన్ని స్వీకరించగలదని నిర్ధారిస్తుంది. ఈ తీర్పు రాజ్యాంగపరమైన ప్రేరణను అందిస్తుంది. ఇప్పుడు, సమగ్ర ఆర్థిక ప్రసూతి హక్కులను దేశంలోని ప్రతి మహిళకు వాస్తవంగా మార్చడానికి శాసన, విధానపరమైన విభాగాలు చర్యలు తీసుకోవాలి.

# పిల్లాయిపల్లి కాలువలోకి తక్షణం నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలి

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా

**భూదాన్ పోచంపల్లి, జూన్ 26( ప్రభాత సూర్య ):** పిల్లాయిపల్లి కాలువలోకి వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. గురువారం పోచంపల్లి పట్టణంలోని సిపిఎం మండల కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం మండల కమిటీ సభ్యులు పత్తి బిక్షపతి అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల, చిట్యాల మండలంలోని రైతాంగానికి కీలకంగా సాగుకు ఉపయోగపడుతున్న పిలాయిపల్లి కాలువ మరమ్మతులు వెడల్పు,లోతు కోసం నీటిని బందు చేసి నెల రోజులలో పూర్తి చేసి సాగు నీటిని విడుదల చేసి ఇస్తామని చెప్పి ఇస్తామని మాట తప్పారని, మరోసారి ఈనెల 24న అందిస్తామని చెప్పిన అధికారులు ఎందుకు నీటిని విడుదల చేయడం లేదని ప్రశ్నించారు..? ఇప్పటికే రైతులు అనేకమంది నార్లు పోసుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నారని, నారు ముదిరిపోయే ప్రమాదం ఉంది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరోసారి ప్రకటించిన విధంగా ఒకటవ తేదీన తక్షణం నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతాంగాన్ని సమీకరించి




ఆందోళన చేపడుతామని నర్సింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వము అందరికీ ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని చెప్పి కొందరికే ఇవ్వడం ఎట్లా కరెక్టని ప్రశ్నించారు. ఇప్పటికైనా గ్రామాలలో అర్హత ఉండి దరఖాస్తు చేసుకొన్న ప్రతి ఒక్కరికి రాజకీయాల కతీతంగా ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని నర్సింహ కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, అందెల జ్యోతి, మండల కమిటీ సభ్యులు నోముల కృష్ణారెడ్డి, నెల్లికంటి జంగయ్య, కలుకూరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మరోమారు బెల్ట్ షాపుల పై స్పెషల్ డ్రైవ్

## దొంగచాటుగా నిర్వహించే బెల్ట్ షాపులపై ఉక్కుపాదం : కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు, జూన్ 26( ప్రభాత సూర్య ):** గ్రామాలలో అక్కడక్కడా దొంగచాటుగా బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహారించాలని పోలీసులకు మరోమారు సూచించారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ...మరోమారు గ్రామాలలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఉక్కుపాదం మోపాలన్నారు.. గ్రామాలలో నెలకొన్న సమస్యలు తెలుసుకోడానికి ఇటీవల పలివెల గ్రామంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పర్యటించిన సందర్భంలో పలువురు మహిళలు గ్రామంలో దొంగచాటుగా బెల్ట్ షాపులు నిర్వహిస్తు మద్యం అమ్ముతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు... గ్రామాలలో దొంగచాటుగా బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారని మీ దృష్టికి వస్తే వెంటనే సమాచారం ఇవ్వండని బెల్ట్ షాపులు నిర్వహించే వాళ్ళపైన కఠిన చర్యలు తీసుకుంటామని మాట ఇచ్చారు... గురువారం మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా మరో మారు బెల్ట్ షాపుల నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు... మొదటగా మునుగోడు మండలంలోని గ్రామాల్లో ఎంతమంది దొంగచాటుగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారో



జాబితా సిద్ధం చేయాలని పోలీసులను ఆదేశించారు... మద్యం ఎక్కువగా తీసుకోవడం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ముఖ్యంగా యువత చెడు వైపు వెళ్లడానికి మద్యం కారణమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు... మునుగోడు నియోజకవర్గంలో యువత చెడు వ్యసనాలకు పాల్పడకుండా ఉండడానికే బెల్ట్ షాపుల నిర్మూల, గంజాయి మాదకద్రవ్యాల నిర్మూలన ను కఠినంగా చేపడుతున్నామని అన్నారు.బెల్ట్ షాపులు నిర్మూలించిన తర్వాత గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొందని ఆ వాతావరణాన్ని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లడానికి అనునిత్యం ప్రయత్నం చేస్తూనే ఉంటామన్నారు...

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేద ప్రజలపై భారం పడకుండా ప్రయత్నం

గ్రామాలకు దగ్గరగా ఉన్న వాగుల నుండి ఉచితంగా ఇసుక తీసుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని అధికారులకు ఫోను

ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేదలకు మానవతా దృక్పథంతో తక్కువ ధరకే కంకరను ఇవ్వాలని క్రషర్ యజమానులను కోరిన రాజ్ గోపాల్ రెడ్డి





**మునుగోడు, జూన్ 26( ప్రభాత సూర్య):** ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేద ప్రజలకి ఆర్థిక భారం పడకుండా చూడాలని క్రషర్ యజమానులను కోరారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ... మునుగోడు లోని క్యాంపు కార్యాలయం లో మునుగోడు మండలానికి చెందిన పలు గ్రామాల కు చెందిన ఇందిరమ్మ ఇల్లులు మంజూరైన లబ్దిదారులు కలిసి స్థానికంగా వున్న వాగుల నుండే ఉచితంగా ఇసుకను తీసుకునే విదంగా అనుమతులు ఇప్పించాలని ఎమ్మెల్యే ని కోరారు.... వెంటనే మైనింగ్ అధికారులు, కలెక్టర్ తో మాట్లాడి అనుమతులు ఇవ్వాలన్నారు... ఎమ్మెల్యే చెప్పిన విదంగానే అనుమతులు ఇస్తామని అధికారులు ఫోన్ లో తెలిపారు... ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమయ్యే కంకర (కాంక్రీట్ లో ఉపయోగించే చిన్న సైజు రాయి) ను తక్కువ ధరకు ఇవ్వాలని క్రషర్ యజమానులను సైతం కోరారు.. మానవత దృక్పథంతో ఈ పని చేయండని ఎమ్మెల్యే కోరిన వెను వెంటనే క్రషర్ యజమానులు కూడా తమవంతుగా ధరలు తగ్గిస్తామని చెప్పారు... మరో వైపు ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్న సిమెంట్ పరిశ్రమల యజమానులతో కూడా మాట్లాడి ఇందిరమ్మ ఇల్లులు నిర్మించుకునే పేదవారికి తక్కువ ధరకు సిమెంటు లభించేలా ప్రయత్నిస్తాన ని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు... గత పది సంవత్సరాలుగా పేదవారు సొంతింటి కలకు దూరంగా ఉన్నారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేశామని ఆ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం వైపు నుండి వచ్చే నిధులతోపాటు, పేద ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఉచితంగా ఇసుక ఇవ్వడంతో పాటు, నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్ కాస్ట్ తగ్గించే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు....

## ఫోటో జర్నలిస్టు ఆంజనేయులు పరామర్శించిన వనపర్తి జిల్లా జర్నలిస్టులు....



**వనపర్తి ప్రతినిధి ప్రభాత సూర్య..** వనపర్తి జిల్లా ఆంధ్రప్రభ దినపత్రిక ఫోటో జర్నలిస్టు కటికల ఆంజనేయులు తండ్రి కె చిన్న బిసన్న గురువారం ఉదయం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన బిసన్న మృతి చెందిన వార్తను తెలుసుకున్న వనపర్తి జిల్లా జర్నలిస్టులు పెబ్బేరులో ఆంజనేయులు ఇంటికి వెళ్లి తండ్రి చిన్న బిసన్న మృతదేహం దగ్గర పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించి జర్నలిస్టు ఆంజనేయులు ను ప్రమర్శించారు కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్ క్లబ్ నాయకులు బలేమోని రమేష్ కొండన్న యాదవ్ లక్ష్మణ్ దినేష్ యాదిరెడ్డి ఖలీల్ తరుణ్. గోపాల్ చారి తదితరులు ఉన్నారు

## సిల్క్ శాలువాలు వద్దు- చేనేత శాలువాలు వాడండి

చేనేత శాలువాలు మాత్రమే వాడాలని మునుగోడు నియోజకవర్గ నాయకులు, ప్రజలకు పిలుపునిచ్చిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, జూన్ 26( ప్రభాత సూర్య):** తనను కలవడానికి వచ్చే వాళ్ళు , తనకు శాలువాలు కప్పాలనుకునే వాళ్ళు సిల్క్ శాలువాలు తీసుకురాకుండా చేనేత శాలువాలతో రావాలని మునుగోడు నియోజకవర్గ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ... మునుగోడు నియోజకవర్గం లో నేతన్నల తయారచేసే చేనేత శాలువాలను మాత్రమే తీసుకురావాలని అన్నారు... మునుగోడు నియోజకవర్గం లో ఎంతోమంది నేతన్నలు నేత పని పై ఆధారపడి జీవిస్తున్నారని, నేతన్నలు నేసే శాలువాలు తీసుకోవడం వల్ల వారికి ఉపాధి కల్పించిన వాళ్లమవుతామని అన్నారు... గురువారం నుండి తన దగ్గరికి వచ్చే ప్రతి ఒక్కరు కూడా మునుగోడు నియోజకవర్గ చేనేత కుటుంబాలు నేసే శాలువాలు మాత్రమే తీసుకురావాలని పిలుపునిచ్చారు...

## బిఆర్ఎస్ మండల మహిళ అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



**రాజపేట, ( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో గాల్ బ్లాడర్ శస్త్ర చికిత్స చేయించుకొని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బిఆర్ఎస్ మండల మహిళ అధ్యక్షురాలు ఎడ్ల బాల లక్ష్మీ ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సట్టు తిరుమలేశ్, పట్టణ అధ్యక్షులు వీరేశం, మదర్ డైరీ మాజీ డైరెక్టర్ వెంకట్ రామ్ రెడ్డి, మండల యూత్ ప్రెసిడెంట్ పల్లె సంతోష్, ఉపాధ్యక్షులు ఎర్రగోకుల జశ్వంత్, మాజీ సర్పంచులు గుంటి మధుసూదన్ రెడ్డి, రామిండ్ల నరేందర్, కార్ల కర్నకార్ రెడ్డి, కనకయ్య, కటకం స్వామి, బూరుగు సతీశ్ రెడ్డి, నర్సింగ రావు, గంధమల్ల సురేష్, పిట్టల వెంకటేష్, మోత్కుపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరి బాధ్యత...

- ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి

మిర్యాలగూడ డిగ్రీ కాలేజీలో మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమం




**మిర్యాలగూడ, జూన్ 26 (ప్రభాత సూర్య) :** విద్యార్థులు, యువత దేశ భవిష్యత్తు అని భావించి డ్రగ్స్ వంటి మానవ మానసిక ఆరోగ్యాన్ని నాశనం చేసే పదార్థాల నుంచి దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనలో ప్రతీ ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ ఎల్. మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ కేఎన్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, యాంటీ డ్రగ్ కమిటీలు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎమ్. శివకృష్ణ మాట్లాడుతూ, ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్ అంటూ, విద్యార్థులు ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మాదకద్రవ్యాల ముప్పు నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. ఎస్ఐ. రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ, ఎవరైనా డ్రగ్స్ అమ్మడం, కొనడం చూస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యలతోనే సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.నరేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. నాగరాజు, లావణ్య ఎస్ఐ, పర్వీన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.


## రైతుల శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం
## డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య




**తుర్కయాంజల్,జూన్ 26, ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ లోని తులిప్స్ గ్రాండ్ హోటల్ లో ది హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మహాజన సభ సమావేశం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు పరిపాలన నివేదిక, బ్యాంకు యొక్క జమ, ఖర్చు, లాభనష్టాలు మరియు ఆస్తులు అప్పుల మహాజన సభ ముందు ప్రవేశపెట్టడం జరిగిందనీ అన్నారు. ఈ సమావేశంలో పలు అంశాల పై ( సొసైటీ )ల చైర్మన్ ల సమస్యలు, సందేహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్.రవీందర్ గౌడ్, సీఈఓ భాస్కర సుబ్రహ్మణ్యం,డైరెక్టర్లు పి.అంజిరెడ్డి, డి.చంద్రశేఖర్, బి.సతీష్,ఎం.బాల్ రెడ్డి,పి.రామ్ రెడ్డి,పి.లక్ష్మారెడ్డి, కె.శ్యాంసుందర్ రెడ్డి,జి సైదా,పీ.జీ.వి రాణి, ప్రొఫెషనల్ డైరెక్టర్ల వి.గిరిధర్, వివిధ మండల సొసైటీ చైర్మన్ లు, డీసీసీబీ బ్యాంక్ జి.ఎంలు ప్రభాకర్ రెడ్డి, ఫణి శ్రీ రాం, డి.జి.ఎంలు నాగంజలి, కిరణ్ కుమార్, సతీష్ రెడ్డి, ఎ.జి.ఎంలు బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా పేరుతో బెదిరింపులు
## ఇద్దరిపై కేసు నమోదు

నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ – హైడ్రా సంస్థ పేరును దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు




**హైదరాబాద్ (జూన్ 26, ప్రభాత సూర్య) :** హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. గండిపేట మండలం నెక్నాంపూర్ గ్రామంలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని ఓ ఇంటిని అక్రమంగా పరిశీలించి, ఇంటిని కూల్చేస్తాం అంటూ బెదిరించారని ఫిర్యాదుదారుడు గుంతకల్ మల్లికార్జున్ పోలీసులకు తెలిపారు. ఈ నెల 23న మధ్యాహ్నం 3:20 గంటల సమయంలో, నలుపు రంగు కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆ ఇంటి ఆవరణలోకి ప్రవేశించి, హైడ్రా నుంచి వచ్చామని పేర్కొన్నట్లు సమాచారం. ఎందుకు వచ్చారని అడిగితే, ఇంటిని కూల్చే అంశంపై సమాచారం సేకరిస్తున్నాం అని వారు తెలిపారు. ఇంటి యజమానితో మాట్లాడాలని సూచించగానే, అక్కడి నుంచి చల్లగా వెళ్లిపోయినట్టు మల్లికార్జున్ తన ఫిర్యాదులో వివరించారు. పోలీసుల విచారణలో నిందితుల్లో ఒకరు మిరియాల వేదాంతం (22), కారు డ్రైవర్ కాగా కరీంనగర్ జిల్లాకు చెందినవాడిగా గుర్తించారు. ప్రస్తుతం అల్కాపూర్‌లో నివసిస్తున్నారు. మరొకరు యెలిసెట్టి శోభన్‌బాబు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగిగా, పుప్పాలగూడ ఎస్టీమ్ రెసిడెన్సీలో నివాసముంటున్నారు. ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

హైడ్రా స్పందన – దుర్వినియోగం అంగీకారయోగ్యం కాదు

ఈ ఘటనపై హైడ్రా సంస్థ స్పందిస్తూ, తమ పేరును వాడుతూ ఎవ్వరైనా బెదిరింపులు, మోసాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. మా సంస్థ నుంచి విచారణ జరిగితే, అధికారిక ఉద్యోగులే వివరాలు ఇస్తారు. ఉద్యోగులే మోసాలకు పాల్పడినా చర్యలు తప్పవు, అని ప్రకటనలో పేర్కొంది. మార్గదర్శకంగా, హైడ్రా సంస్థ వాట్సాప్ నంబర్ 8712406899 కు సంబంధిత సమాచారం, ఫోటోలు పంపించాలని కోరింది.

## తుర్కయంజాల్‌లో అక్రమ కట్టడాలపై అధికారుల నిర్లక్ష్యం?

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు...

మునిసిపల్ ఆదాయానికి భారీగా గండి..? లక్షల్లో కోతలు..!

అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలకు వెనకడుగు..!




**తుర్కయంజాల్, జూన్ 26 (ప్రభాత సూర్య):** తుర్కయంజాల్ మునిసిపాలిటీ పరిధిలోని యంజాల్, మునుగనూరు ప్రాంతాల్లో అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, నాయకుల ప్రోత్సాహంతో అనేక నిర్మాణాలు జీ ప్లస్ 2 అనుమతితో, జీ ప్లస్ 3 నిర్మాణం చేపడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టించుకోని అధికార యంత్రాంగం నిబంధనలను బేసిక్స్‌గానైనా పాటించకుండా అడ్డదిడ్డంగా నిర్మాణాలు సాగుతున్నా, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మున్సిపల్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లే వ్యవహరిస్తుండటం గమనార్హం. అనుమతి లేని నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్న చర్యలు తీసుకోవడంలో వెనకడుగేసే తీరుపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి.

# మీసేవ నెట్ సెంటర్లో నకిలీ సర్టిఫికెట్ల హల్ చల్







ఫోర్జరీ సంతకాలతో 20 పైగా వెలుగులోకి వచ్చిన వైనం

జననం, మరణం, కల్యాణ లక్ష్మి పత్రాలు సరి చేసుకోండి

తనిఖీ నిర్వహించి ఆదేశాలిచ్చిన ఆర్డీవో శేఖర్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 26( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో ఉన్న మీసేవ కేంద్రాలు నెట్ సెంటర్లు లో నకిలీ సర్టిఫికెట్లు ఫోర్జరీ సంతకల ద్వారా వెలుగులోకి వచ్చింది. పీహెచ్సీ అధికారి రవీనా ఫిర్యాదు మేరకు గురువారం రోజున ఆర్డీవో శేఖర్ రెడ్డి మీసేవ ఇంటర్నెట్ సేవా కేంద్రాలలో సర్టిఫికెట్ల తనఖి నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ సంతకాని ఫోర్జరీ చేశారని 15 నుండి 20 కు పైగా చేసినట్టు




తెలిపారు. ఎవరైతే జననం, మరణ, కల్యాణ లక్ష్మి ధృవీకరణ పత్రాలు అప్లై చేసుకున్నవారు తిరిగి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి మరోకసారి సరి చేసుకోవాలని మండల ప్రజలకు సూచించారు. ఫోర్జరీ సంతకాల సర్టిఫికెట్లతో ఉద్యోగాలకు వెళితే నకిలీ సర్టిఫికెట్లు ధృవీకరణతో నిలిపివేయబడుతుందని తెలిపారు. తెలవకుండా మీసేవ కేంద్రం నెట్ సెంటర్లు అంటూ ఇలాంటి సర్టిఫికెట్లను అప్లై చేసుకుని మోసపోవద్దని అన్నారు. ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై జగన్ సర్టిఫికెట్లను పరిశీలన చేసి ఫోర్జరీ చేసిన వాళ్లను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రమోద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఇంజాపూర్‌లో ప్రభుత్వ భూమిపై అక్రమ కట్టడాల తొలగింపు

సర్వే నెం.199లో రెవెన్యూ శాఖ చర్య – కబ్జాలపై కఠిన చర్యలు





**తుర్కయంజాల్, జూన్ 26 (ప్రభాత సూర్య):** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూములపై చేపట్టిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. గురువారం సర్వే నంబర్ 199 లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యక్తులు నిర్మించిన అక్రమ కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఇప్పటికే ముందస్తు నోటీసులు ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో స్థానిక తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. ఇంజాపూర్ ప్రాంతంలో భవిష్యత్తులో ఈ తరహా ఆక్రమణలు జరగకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



# తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ దాడులు

రికార్డులను, కీలక పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన

పది మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు





**సికింద్రాబాద్, ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్రంలో అవినీతిపై నిఘా మరింత కఠినమవుతోంది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉన్న రవాణా శాఖ కార్యాలయాల్లో అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టి కలకలం రేపింది. అవినీతికి పాల్పడుతున్న ఆర్టీఏ అధికారులు, ఖాతాదారులను మోసం చేస్తున్న బినామీ ఏజెంట్లపై నిరంతరంగా వస్తున్న ఆరోపణలతో ఈ దాడులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. హైదరాబాదులోని తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలలో ఏసీబీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్, రంగారెడ్డి జిల్లా డీఎస్పీ ఆనంద్‌ల పర్యవేక్షణలో అధికారులు కార్యాలయాల్లోని రికార్డులను, కీలక పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఇద్దరు క్లర్క్‌లతో పాటు కార్యాలయం వద్ద తిష్టవేసిన పదిమంది ఏజెంట్లను అదుపులోకి తీసుకొని, కార్యాలయం తలుపులు మూసివేసి, బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిలిపివేసి అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. వారి వద్ద నుంచి వాహన ధ్రువీకరణ పత్రాలు, నగదు, సెల్‌ఫోన్లు, ఇతర కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక్కో ఏజెంట్ వద్ద సగటున 50కి పైగా వాహన పత్రాలు ఉండటాన్ని గమనించామని ఆయన చెప్పారు. ఫోన్‌లను ఫోరెన్సిక్‌గా విశ్లేషించి మరిన్ని ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇకపోతే, ఈ అవకతవకల వ్యవహారంలో ఆర్టీఏ సిబ్బంది పాత్రపై కూడా అనుమానాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. అధికారుల పాత్రను అన్ని కోణాల్లో విచారించి సత్యాన్ని వెలికి తీయాలని ఏసీబీ భావిస్తోంది. ఈ దాడులు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ దాడులతో ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు.

# శివన్నగూడెం రిజర్వాయర్ నుండి నీరందించడానికి డిపిఆర్ రెడీ చేయండి





**నియోజకవర్గ వ్యాప్తంగా వున్న వాగుల పై వీలైనన్ని చెక్ డ్యాములు నిర్మించాలి**

**నియోజకవర్గం లో 148 చెరువులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పటిష్టంగా అభివృద్ధి చేసుకోవాలి**

**శివన్నగూడెం రిజర్వాయర్ ద్వారా చెరువులు నింపుకునేలా కనెక్టివిటీని రూపొందించుకోవాలి**

**ఇరిగేషన్ సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**మునుగోడు, జూన్ 26( ప్రభాత సూర్య ):** మునుగోడు నియోజకవర్గంలో నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ... శివన్న గూడెం రిజర్వాయర్ నుండి సంస్థాన్ నారాయణపూర్, చౌటుప్పల్ మండలాలకు నీటిని తరలించడానికి డి పి ఆర్ ను రెడీ చేయాలన్నారు... శివన్న గూడెం రిజర్వాయర్ ఎఫ్ ఆర్ ఎల్ నుండి ఎన్ని మీటర్ల మేర ఎత్తు నుండి నీటిని పంపు చేయాలని, ఎన్నిచోట్ల నీటిని ఎత్తిపోయాలనే విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు... నియోజకవర్గంలో ఉన్న వాగులపై వీలైనన్ని చెక్ డ్యాములు నిర్మించాలని, ఈ చెక్ డ్యాములు నిర్మించడం వల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా పరిసర ప్రాంతాల భూములు కూడా వ్యవసాయానికి అనుకూలంగా మారుతాయన్నారు... మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా 148 చెరువులను అభివృద్ధి చేసుకోవడానికి ఎస్ ఎస్ ఆర్ రెడీ చేయాలన్నారు... ప్రతి చెరువులో చెట్ల తొలగింపు, పూడికతీత, చెరువు కట్టను పటిష్టం చేయడం, అలుగును పటిష్టం చేసే పనులకు ఎంత ఖర్చవుతుందో డీటెయిల్డ్ గా రిపోర్టు రెడీ చేయమన్నారు... ఈ అభివృద్ధి చేసుకునే చెరువులకు భవిష్యత్తులో శివన్న గూడెం రిజర్వాయర్ ద్వారా నీటిని తీసుకొచ్చేలా కనెక్టివిటీ ప్రణాళిక ను కూడా రూపొందించుకోవాలన్నారు.. భవిష్యత్తులో నియోజ కవర్గంలో నీటి కొరత రాకుండా ఉన్న వనరులను సద్వినియోగపరుచుకుంటూ చెక్ డ్యామ్ ల నిర్మాణం ద్వారా, చెరువుల అభివృద్ధి ద్వారా ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టుకునే విధంగా అభివృద్ధి చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మర్రిగూడెం ఈ ఈ రాములు, చౌటుప్పల్ మనోహర్, డి ఈ లు ఏఈలు, వివిధ మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు....

# మూడు పార్టీల్లోనూ... సమరోత్సాహం

**హైదరాబాద్ :** తెలంగాణలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి ఏడాది దాటింది. అయినా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. దీంతో కొందరు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోగా ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. కానీ నిర్వహించలేదు. మళ్లీ కోర్టుకు వెళ్లడంతో కీలక ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు రిజర్వేషన్లపై పార్టీల్లో, ఆశవహుల్లో ఉత్కంఠ నెలకొంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తు లేకుండా జరుగుతాయి. దీంతో స్థానికంగా నమ్మకమైన, బలమైన నేతలకు పార్టీలు మద్దతు ఇస్తాయి. ఇక ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ సమరానికి సై అంటున్నాయి. అధికార పార్టీ హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత నెలకొంది. దీంతో ఎన్నిల్లో పైచేయి సాధించేందుకు మూడు పార్టీలు యతినస్తున్నాయి. పార్టీల గుర్తుపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సమాయత్తం అవుతున్నాయి. మెజారిటీ మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు దక్కించుకోవాలని ప్రణాళిక రూపొందిస్తున్నాయి.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటికీ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన చాలా హామీలు నెరవేర్చలేదు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ మినహా ఏదీ పూర్తిస్థాయిలో అమలు కాలేదు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. మహిళలకు రూ.2,500 అందడం లేదు. పింఛన్లు పెరగలేదు. ఇక రైతుభరోసా గత యాసంగి, వానాకాలం కొద్దిమందికే అందింది. ఈ ఖరీఫ్‌లో దాదాపు అందరికీ పెట్టుబడి అందించారు. ఇక రైతు కూలీలకు కూడా ఏటా రూ.12 వేల సాయం కొద్ది మందికే అందుతోంది. దీంతో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఇవి ప్రభావం చూసే అవకాశం ఉంది.ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు పదేళ్ల పాలన అనుభవం, గత పాలనలో అందించిన సంక్షేమ పథకాలు ప్లస్ పాయింట్. ఇదే సమయంలో బీఆర్ఎస్‌కు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బలమైన క్యాడర్ ఉంది. దీంతో స్థానిక ఎన్నికల్లో





పట్టు సాధించి అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని గులాబీ నేతలు భావిస్తున్నారు. అయితే ఆ పార్టీలో ఇటీవలి పరిణామాలు, నేతల మధ్య ఐక్యత లేకపోవడం పార్టీకి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.ఇక మరో ప్రతిపక్ష పార్టీ అయిన బీజేపీకి గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా పట్టు లేదు. ఉత్తర తెలంగాణలోని కరీనంగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో మాత్రంమే కాస్త పట్టు ఉంది. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో బీజేపీకి పెద్దగా బలం, క్యాడర్ లేవు. అయితే ఇదే సమయంలో పట్టణాల్లో బీజేపీకి యూత్ ఫాలోయింగ్ ఎక్కువ. యువ ఓటర్లు, హిందువులు బీజేపీ వెంటే ఉంటున్నారు. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో ఈసారి మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికల్లోనూ గతంకన్నా మెరుగైన ఫలితాలు సాధించాలని కమలనాథులు భావిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ గణన చేపట్టింది. దీని ఆధారంగా వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రణాళిక రూపొందిస్తోంది. అయితే ఈ అంశం కేంద్రం పరిధిలో ఉంటుంది. మరోవైపు రిజర్వేషన్లపై కోర్టులో కేసు ఉంది. ఈ తరుణంలో వార్డుల విభజనకు ఆటంకం కలుగనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం సీట్లు ఇవ్వాలని భావిస్తోంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు నిర్దేశిత రిజర్వేషన్లు సరైన రీతిలో అమలు కావడం ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం లభించనుంది.తెలంగాణ హైకోర్టు తీర్పు స్థానిక సంస్థల ఎన్నికలను వేగవంతం చేయడమే కాక, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఈ ఆదేశాలను సకాలంలో అమలు చేయడం ద్వారా స్థానిక పాలనా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉంది. ఈ ప్రక్రియ సమర్థవంతంగా, పారదర్శకంగా జరిగితే, తెలంగాణలో స్థానిక సంస్థలు మరింత శక్తివంతంగా పనిచేసే అవకాశం ఉంది.

## దుమ్మురేపుతున్న ఇండియన్ స్పేస్ ట్రావలెర్స్

**న్యూఢిల్లీ :** భారత వ్యామోగామి శుభాన్షు శుక్లా.. అంతరిక్షంలోకి అడుగుపెట్టారు. భారత గగనయాన్ వ్యామోగాముల్లో ఒకరైన శుభాన్ష్ ఇప్పటికే భూ కక్ష్యలో ఉన్నారు. అంతకు ముందు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్ రాకేశ్ శర్మ, ఇండియన్ అమెరికన్స్ కల్పనాచావ్లా, సునీత విలియమ్స్ కూడా స్పేస్‌లోకి వెళ్లారు. అయితే భారతీయ పౌరుడిగా నాసాకు సంబంధించిన స్పేస్ మిషన్‌లో అంతరిక్షానికి వెళ్లిన రెండో భారతీయుడు శుభాన్ష్. మన భారతీయుడు అంతరిక్షంలో అడుగుపెట్టిన అరుదైన సందర్భంలో వినువీధిలో మన వాళ్లు సత్తా గురించి మాట్లాడుకుందాంఅనేక రంగాల్లో సత్తా చాటే మన వాళు.. అంతరిక్షంలోనూ అడుగుపెట్టారు. రోదసీయాత్రలు.. ఆకాశయానంలో భారత్ ఇంకా అంత ముందడుగు వేయలేదు కానీ.. నాసా ద్వారా మన భారతీయులు అంతరిక్షయానం చేశారు. అయితే?స్పేస్ ఎక్కువగా జరిగే అమెరికాలో అనేక రూపాల్లో అంతరిక్షానికి వెళ్లొచ్చు. అలా ఇప్పటికే ఇద్దరు తెలుగు వ్యక్తులు భూమిని అ?ంతరిక్షం నుంచి చుట్టేశారు. ఇప్పుడు మరొకరు దానికి సిద్ధమవుతున్నారు. ప్రైవేట్ స్పేస్ మిషన్ల ద్వారా రెండు యాత్రలు పూర్తయ్యాయి. పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి 2029లో ఆస్ట్రోనాట్‌గా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకూ ఎవరెవరు వెళ్లారంటే..

**భూమిని చుట్టేసిన బండ్ల శిరీష**

బండ్ల శిరీష.. గుంటూరమ్మాయి.. తెనాలికి చెందిన బండ్ల అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయ మహిళ. సునీత విలియమ్స్, కల్పనా చావ్లా వెళ్లినప్పటికీ సునీత అమెరికన్ ఇండియన్. కల్పనా చావ్లా తర్వాత అంతరిక్షానికి వెళ్లింది బండ్ల శిరీషనే.. చిన్నప్పుడు హైదరాబాద్‌లో ఉన్న శిరీష తర్వాత తన తల్లిదండ్రులతో కలిసి యుఎస్‌లోని హ్యూస్టన్‌కు వెళ్లిపోయారు. అక్కడే ఏరానాటికల్ ఇంజనీరింగ్, ఆ తర్వాత మాస్టర్స్ చేసిన శిరీష..వెర్జిన్ అనే స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ సంస్థలో చేరారు. ప్రస్తుతం ఆ సంస్థలో వైస్ ప్రెసిడెంట్ గా ఉన్నారు. 22 స్పేస్ మిషన్‌లో స్పేస్ టూరిస్ట్‌గా వెళ్లారు. యూనిటీ 22 , 2021లో భూమి సబ్ ఆర్బిటల్ స్పేస్‌కు వెళ్లింది. జీరో గ్రావిటీని ఫేస్ చేసిన రెండో భారతీయ మహిళగా.. తొలి తెలుగు వ్యక్తిగా శిరీష బండ్ల రికార్డు సృష్టించారు.

**గగనయానం చేసిన తోటకూర గోపీచంద్..**

మన వాళ్ల అంతరిక్ష యానం శిరీషతోనే ఆగలేదు. బెజవాడకు చెందిన గోపీచంద్.. కూడా స్పేస్ యాత్రను చేశాడు. అమెజాన్ అధిపతి కు చెందిన బ్లూ ఆరిజన్ న్యూషెపర్డ్ 25 వ్యామనౌకలో అంతరిక్ష యానం చేశారు. కమర్షియల్ పైలట్ అయిన గోపీచంద్.. యుఎస్‌లో ఓ వెల్‌నెస్ కంపెనీని నిర్వహిస్తున్నారు. 2024 ఆయన న్యూషెపర్డ్ క్రూతో కలిపి ఈ యాత్ర చేశారు.

**జాహ్నవి దంగేటి కొత్త చరిత్ర ?**

స్పేస్‌లోకి వెళ్లనున్న తొలితెలుగు ఆస్ట్రోనాట్

పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి అనే 23 ఏళ్ల అమ్మాయి. 23ఏళ్ల జాహ్నవి 2029లో అంతరిక్షంలోకి వెళ్లనుంది. అమెరికాకు కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ 2029లో చేపట్టే స్పేస్ మిషన్‌లో జాహ్నవి అస్ట్రోనట్ క్యాండిట్ గా ఎంపికైంది. అంతకంటే ముందే ఆమె ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన తొలి భారతీయురాలిగా నిలిచింది. ఇప్పటివరకూ స్పేస్‌కు వెళ్లిన మన వాళ్లు అంతరిక్ష యాత్రికులు స్పేస్ టూరిస్ట్ లకుమాత్రమే. కానీ జాహ్నవి ఓ అస్ట్రోనట్ గా వేళ్లనుంది. మూడేళ్ల పాటు ఆమె వ్యామోగామి శిక్షణ తీసుకోనుంది.తెలుగు విద్యార్థులకు ౹ాఇఓ సబ్జెక్టుల్లో మొదటి నుంచి ఆసక్తి ఎక్కువ. మిగతా రాష్ట్రాల విద్యార్థులతో పోలిస్తే.. సౌత్‌లో అందునా.. ఏపీ, తెలంగాణలో సైన్స్ పట్ల ఎక్కువ ఆసక్తి ఉంటుంది. ఎమెల్లో చేరిన అమెరికాకు మాస్టర్స్‌కు వెళ్లేవాళ్లలోనూ.. తెలుగు వాళ్లు ఎక్కువుగానే ఉంటారు. ఆ ఆసక్తే మనవాళ్లు స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ చేయడానికి దోహదం చేస్తోంది.

## భారతం... బంగారు కొండ...

## దేశంలో 25 వేల టన్నుల యెల్లో మెటల్

**ముంబై :** బంగారం.. ప్రస్తుతం నిత్యం వార్తల్లో నిలుస్తున్న విలువైన లోహం ఇదే. ఎందుకంటే.. నిత్యం బంగారం ధర పెరుగుతోంది. ఇప్పటికే పది గ్రాముల బంగారం రూ.లక్ష దాటేసింది. భవిష్యత్ అంతా బంగారందే అని ఎకనమిస్టులు అంచనా వేస్తున్నారు. దీంతో చాలా మంది బంగారంపైనే పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో ధర పెరుగుతోంది.భారతదేశం బంగారంతో గాఢమైన సాంస్కృతిక, ఆర్థిక సంబంధాన్ని కలిగి ఉంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, భారతీయుల వద్ద సుమారు 25 వేల టన్నుల బంగారం ఉంది. దీని విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం సుమారు 2.4 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. ఈ సంపద పాకిస్థాన్ జీడీపీ కంటే ఆరు రెట్లు ఎక్కువ, కెనడా, ఇటలీ వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీతో సమానంగా ఉంది. మరోవైపు ప్రపంచ యుద్ధారు, ఆర్థిక సంక్షోభాల కారణంగా కూడా బంగారం విలువ పెరుగుతోంది.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, భారతీయ గృహాల వద్ద ఉన్న 25 వేల టన్నుల బంగారం ప్రపంచ బంగార భాండాగారంలో సుమారు 11% ని సూచిస్తుంది. ఈ సంపద, 2.4 ట్రిలియన్ డాలర్ల విలువతో, భారతదేశ జీడీపీలో 40% కంటే ఎక్కువ భాగాన్ని కవర్ చేస్తుంది. ఈ బంగారం ప్రధానంగా ఆభరణాల రూపంలో ఉంటుంది, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, తమిళనాడు ఒక్కటే దేశ బంగారంలో 28% భాగాన్ని కలిగి ఉంది.భారతదేశంలో బంగారం కేవలం ఆర్థిక ఆస్తి మాత్రమే కాదు, సాంస్కృతిక, సామాజిక గుర్తింపు. వివాహాలు, పండుగల వంటి సందర్భాలలో బంగారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, ఆర్థిక భద్రత కోసం బంగారాన్ని నమ్ముకుంటారు. భారతీయ మహిళలు కలిగి ఉన్న 24 వేల టన్నుల బంగారం ప్రపంచంలోని ఐదు అగ్ర దేశాల (అమెరికా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా) బంగార భాండాగారాల కంటే ఎక్కువ. ఈ సంపద గ్రామీణ ప్రాంతాల్లో రుణాలకు హామీగా, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రక్షణగా పనిచేస్తుంది. 2.4 ట్రిలియన్ డాలర్ల విలువైన బంగార సంపద పాకిస్థాన్ జీడీపీ (సుమారు 400 బిలియన్ డాలర్లు) కంటే ఆరు రెట్లు ఎక్కువ.

# దారికొస్తున్న దాయాది దేశం...

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదం, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్, వాణిజ్యం వంటి సమస్యలను భారతదేశంతో మాట్లాడటం ద్వారా పరిష్కరించుకోవాలని పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ కోరుకుంటున్నారు. భారతదేశంతో మాట్లాడటానికి తాను సిద్ధంగా ఉన్నానని సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్‌కు ఆయన చెప్పారు.పాకిస్తాన్ వార్తా ఛానల్ న్యూస్ ప్రకారం, షాబాజ్ షరీఫ్ మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సౌదీ అరేబియాతో మాట్లాడుతూ, పాకిస్తాన్ భారతదేశంతో పీవోకే, సింధు జల ఒప్పందం, వాణిజ్యం, ఉగ్రవాదంపై చర్చలు జరపడానికి పాకిస్తాన్ సిద్ధంగా ఉందని చెప్పారు.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, పాకిస్తాన్‌పై భారతదేశం కఠినమైన చర్యలు తీసుకుంది. పాకిస్తాన్ పౌరులను తిరిగి పంపించడం, అట్టారి వాఘా సరిహద్దును మూసివేయడం, పాకిస్తానీలకు సార్క్ వీసా మినహాయింపును నిలిపివేయడం, పాకిస్తాన్ హైకమిషన్‌లో సిబ్బంది సంఖ్యను తగ్గించడం, సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం వంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. అయితే పాకిస్తాన్ ఉగ్రవాదం, పీవోకే సమస్యను పరిష్కరించే వరకు, దానితో మరే ఇతర సమస్యను చర్చించబోమని భారతదేశం వైఖరి స్పష్టంగా ఉంది.పాకిస్తాన్ సింధూ జల ఒప్పందం అంశాన్ని ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ లోని 57 ముస్లిం దేశాల ముందు లేవనెత్తింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత వివిధ దేశాలకు పంపిన బిలావల్ భుట్టో జర్దారీ ప్రతినిధి బృందం భారతదేశంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. నీటి అంశాన్ని కూడా లేవనెత్తారు. అయితే, పాకిస్తాన్ చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఏ దేశం కూడా పాకిస్తాన్‌కు అండగా నిలిచేందుకు ఆసక్తి చూపలేదు. ప్రపంచ దేశాల ముందు పరువు పోయినంత పనైంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మెల్ల మెల్లగా దిగివస్తోంది.65 సంవత్సరాల క్రితం 1960లో, ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారతదేశం-పాకిస్తాన్ మధ్య సింధు నది జలాల పంపిణీకి సంబంధించి ఒక ఒప్పందం కుదిరింది. ఇది రెండు దేశాలకు చెల్లుతుంది. ఈ ఒప్పందం ప్రకారం, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ జలాలపై పాకిస్తాన్‌కు హక్కు ఉంది. తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్ జలాలపై భారతదేశానికి హక్కు ఉంది. ఈ విధంగా, భారతదేశానికి 20 శాతం నీరు, పాకిస్తాన్‌కు 80 శాతం నీరు లభిస్తాయి. ఈ కోణంలో, నీటి కోసం పాకిస్తాన్ ఎక్కువ ఆధారపడటం ఉంటుంది. అయితే సింధూ నది జలాలను నిలిపివేయడంతో పాకిస్తాన్ తల్లడిల్లుతోంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, మే 6-7 తేదీల మధ్య రాత్రి భారతదేశం ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్తాన్‌లోని లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేసింది. దీనితో ఆగ్రహించిన పాకిస్తాన్, భారత సైనిక స్థావరాలపై దాడి చేయడానికి విఫల ప్రయత్నం చేసింది. దీనికి ప్రతిస్పందనగా భారతదేశం పాకిస్తాన్‌పై చర్యలు తీసుకుంది. నూర్ ఖాన్ వంటి పాకిస్తాన్‌లోని పెద్ద వైమానిక స్థావరం భారతదేశం దాడిలో తీవ్రంగా నష్టపోయింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు చాలా పెరిగాయి.



